

మనం

జనం కోసం అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 3 • సంచిక: 13 • పేజీలు: 8+8 • వెల: రూ.5 | గురువారం • 10-1-2019 | www.manamnews.com | /manamnews

సంక్రాంతి పయనాలు ప్రారంభం



తెలుగు వారి సంస్కృతిలో సంక్రాంతికి ప్రత్యేక స్థానం. మూడు రోజుల పాటు జరుపుకునే ప్రధాన పండుగకు తోడు ముందూవెనుకా రోజులు కూడా కుటుంబ సభ్యులంతా ఒకచోట కూడి సంబురాలు జరుపుకుంటారు. ఈ విధంగా నాలుగైదు రోజులు జరుపుకునే ఈ పండుగ కోసం ప్రజలు నగరం, పట్టణాల నుంచి సొంతూళ్లకు పయనం అయ్యారు. దీనితో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసి పోతున్నాయి. హైదరాబాద్‌లో బుధవారం కనిపించిన ఈ దృశ్యాలు పండుగ ప్రయాణాలకు అద్దం పడుతున్నాయి.





పాక్‌కు చైనా 'సీఎం-302' మిస్సైళ్లు

భారత ఉపఖండంలో మారనున్న బలాబలాలు

బ్రహ్మోస్ శక్తిసామర్థ్యాలున్న 'సీఎం-302'

అత్యాధునిక రాడార్‌ను రూపొందించిన డ్రాగన్

మన దేశ పరిమాణం సైజులో నౌకా దళానికి..



నష్టం జరగదు.. నాది హామీ

5

మీ హక్కులకు భంగం వాటిల్లదు

ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ప్రధాని మోదీ హామీ

బ్యాక్‌ఫుట్‌పై మోదీ

రైతులు, యువత సిక్సర్లు కొట్టాలి

అన్నదాత సత్తా ఏమిటో ప్రధానికి తెలిసింది

జైపూర్ సభలో మోదీకి రాహుల్ చురకలు

ఏకగ్రీవాల జోరు

గ్రామ పంచాయతీ ఎన్నికలో ఏకతా రాగం

- ప్రోత్సాహక నిధుల కోసం ప్రజల యత్నం
- గట్టి అభ్యర్థులున్నచోట పోటీకి సై...
- 2,000 గ్రామాల్లో ఏకగ్రీవాలకు టీఆర్ఎస్ కృషి

హైదరాబాద్, జనవరి 9 (మనం ప్రతినిధి):

ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకం, ప్రజా చైతన్యం కారణంగా గ్రామ పంచాయతీ లను ఏకగ్రీవం చేసుకుంటున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఏకగ్రీవం కావడంతో పాటు మరి కొన్ని గ్రామాల్లో ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఎన్నికల్లో పోటీ చేసి లక్షలు ఖర్చు చేయడం ఎందుకనే ఆలోచనలో గ్రామాల్లో అత్య.దికులు ఏకగ్రీవాలకు మొగ్గుచూపుతున్నారు. సర్పంచ్‌గా పోటీ చేయాల నుకునే వ్యక్తులు గ్రామాభివృద్ధికి ఆర్థిక తోడ్పాటు ఇచ్చే విధంగా రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారు. పంచాయతీ ఎన్ని కల సందర్భంగా గ్రామాలన్ని కళకళలాడుతున్నాయి. జీవనోపాధి కోసం ఎక్కడికో వెళ్లిన వారంతా చేరుకుంటున్నారు. ఇతర ప్రాంతాల్లో ఆర్థికంగా స్థిరపడిన మిగతా 2లో..



సీఎంను కలిసిన సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

3లో..



ఛెబ్బీస్ జనవరిని ఘనంగా జరపాలి

సర్కారీ శాఖల అధికారులతో సీఎస్ సమీక్ష

బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

గణతంత్ర దినోత్సవానికి సిద్ధమవుతున్న పరేడ్ గ్రౌండ్

అమర వీరుల సైనిక స్మారక్ వద్ద పుష్పగుచ్ఛం సమర్పించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, జనవరి 09, (మనం ప్రతినిధి):

జనవరి 26న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మిగతా 2లో..

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం; తిథి: శుక్లపక్షం చవితి ప.2.05 వరకు; తదుపరి: పంచమి; నక్షత్రం: శతభిషం రా.3.02 వరకు; తదుపరి: పూర్వాభాద్ర; వర్జ్యం: ఉ.8.33 నుంచి 10.21 వరకు; దుర్ముహూర్తం: ఉ.10.17 నుంచి 11.02 వరకు; తదుపరి: ప.2.44 నుంచి 3.24 వరకు; రాహుకాలం: ప.1.30 నుంచి 3.00 వరకు; యమగండం: ఉ.6.00 నుంచి 7.30 వరకు; అమృతఘడియలు: రా.7.10 నుంచి 8.54 వరకు;

వాతావరణం



గురువారం వాతావరణం చాలావరకు పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగాలుల తీవ్రత పెరిగే అవకాశముంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 27 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 16 డిగ్రీలు

గాలి వేగం: గంటకు 10కి.మీ.

ఇదీలోకం!



మీకన్నా కోచ్‌లకే నజరానా ఎక్కువటగా!..
ఆట మీది.. షోకు వాళ్లది..



తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రాజెక్టులపై అధికారులతో చర్చించిన ఉపరాష్ట్రపతి

రేణిగుంట నుంచి వెంకటాచలం(నెల్లూరు) వరకూ రైలులో ప్రయాణించిన వెంకయ్యనాయుడు 3లో..

ఆ సమయంలో రైల్వే అధికారులతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రైల్వే ప్రాజెక్టులపై భేటీ

నడికుడి- శ్రీకాళహస్తి మార్గం పనుల గురించి ప్రత్యేక చర్చ

25 జిల్లాలు చేస్తా

ఒక్కో పార్లమెంటు స్థానం.. ఒక్కో జిల్లా



- పేద ప్రజలకు.. గుండె చప్పుడునవుతా
- ప్రజాసంక్షేమం కోసం కడదాకా జీవిస్తా
- పాదయాత్రలో మీ కష్టాలు తెలుసుకున్నా
- నడిచింది నేను.. కానీ నడిపించింది మీరే
- అప్పుల్లో మన రైతులు దేశంలో నెంబర్ 2
- అయినా వ్యవసాయ వృద్ధిరేటుపై గప్పాలు
- అక్షరాలా 6వేల ప్రభుత్వస్కూళ్ల మూసివేత
- మేమొస్తే ప్రజలకు ఇంకా చేరువగా పాలన
- గ్రామానికో సచివాలయం.. ఇంటికే పథకాలు
- రైతు పెట్టుబడికి ఏడాదికి రూ.12,500 ఇస్తాం
- ఆక్వా రైతుకు రూ. 1.50కే యూనిట్ కరెంటు
- పాదయాత్ర ముగింపు సభలో జగన్మోహన్‌రెడ్డి

పాదయాత్ర కాలం: 341 రోజులు


జగన్ నడిచిన జిల్లాలు: 13

మొత్తం నియోజకవర్గాలు: 134

తిరిగిన గ్రామాలు: 2,516

బహిరంగ సభలు: 124

ఆత్మీయ సమ్మేళనాలు: 55



"ఆరు నెలలు కలిసి ఉంటే వారు వీరవుతారు. ఈ 14 నెలలు పేదవాడితోనే ఉన్నాను. వారి కష్టాలు వింటూనే.. వారికి భరోసా ఇస్తూనే నడిచాను. ప్రతి పేదవాడికి మంచి చేయాలనే తపన ఉంది. చెడిపోయిన రాజకీయ వ్యవస్థను బాగుచేసేందుకు బయలుదేరిన మీ బిడ్డకు తోడుగా ఉండమని, ఆశీర్వదించమని కోరుతున్నాను. ప్రజాసంకల్ప యాత్ర ఇంతటితో ముగుస్తున్నా.. పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. పొత్తులు, ఎత్తులను, అన్యాయాలను జయించేందుకు మీరంతా తోడుగా ఉండాలి"

వివరాలు 2లో..

నిర్మాణంలోని ఆసుపత్రిలో భారీ మంటలు

ఏడుగురికి గాయాలు

నాగపూర్, జనవరి 9:

నిర్మాణంలోని ఆసుపత్రి భవనంలో చెలరేగిన మంటల్లో ఏడుగురు గాయపడ్డారు. మంటల్లో భవన నిర్మాణ కూలీలు 20 మంది చిక్కుకు పోయారు. గాయపడ్డవారిలో ఇద్దరి పరిస్థితి మిగతా 2లో..





అలోక్‌వర్మ బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ, జనవరి 9:

సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ తిరిగి తన పూర్వ బాధ్య తలను చేపట్టారు. బుధవారం ఉదయం సీబీఐ కార్యాల యానికి చేరుకొని బాధ్యతలను స్వీకరించారు. కోర్టు తీర్పు మేరకు ఈ సమయంలో ఆయనకు పరిమితమైన అధికా రాలు మాత్రమే ఉండనున్నాయి. అలోక్‌పై వచ్చిన ఆరోప ణల నేపథ్యంలో ప్రభుత్వం అక్టోబరు 23న బలవంతపు సెలవుపై పంపిన సంగతి మిగతా 2లో..

100 కోట్లు కట్టండి

రాహుల్, సోనియాలకు ఆదాయపన్ను నోటీసులు

- రూ. 310 కోట్ల ఆదాయం దాచివేత
- 2011-12 ఎసెస్‌మెంట్ సంవత్సరం
- రీఎసెస్‌మెంట్ ప్రారంభించిన ఐటీశాఖ
- రాహుల్‌కు రూ. 68.1 లక్షల ఆదాయం!
- ఆస్కార్ ఫెర్నాండెజ్‌కు రూ. 49 కోట్లు
- ఏజేఎల్ కేసు సంబంధిత ఆదాయం
- సుప్రీం కోర్టుకూ తెలిపిన ఐటీ శాఖ
- నోటీసులు ఇచ్చేందుకు సుప్రీం ఓకే



న్యూఢిల్లీ, జనవరి 9:

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఆయన తల్లి.. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీలకు ఆదా యపన్ను శాఖ రూ. 100 కోట్లు కట్టాలంటూ నోటీసు జారీచేసింది. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజే ఎల్)కు సంబంధించిన ఆదాయాలను 2011-12 ఎసెస్‌మెంట్ సంవత్సరంలో ఇద్దరూ దాచిపెట్టారని, అవి కొన్ని వందల కోట్లు ఉన్నాయని ఆదాయపన్ను శాఖ అధికారులు ఆ నోటీసులలో తెలిపారు. సోని యా గాంధీ రూ. 155.4 కోట్లు, రాహుల్ గాంధీ రూ. 155 కోట్ల చొప్పున ఆదాయాన్ని లెక్కల్లో చూపించలేదన్నారు. ఈ ఆదాయం అంతా ప్రక టించిన దాంట్లో ఎక్కడా



ఘేట్బీస్ జనవరిని ఘనంగా జరపాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా వివిధ బిభాగాల అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.కె.జోషి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. రిపబ్లిక్ డే వేడుకల ఏర్పాట్లపై సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంబంధిత శాఖల అధికారులతో బుధవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జనవరి 26 న ఉదయం పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా గవర్నర్ ఇ.ఎస్.ఎల్ నరసింహన్ హాజరవుతారని చెప్పారు.

పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేపట్టాలని పోలీస్ శాఖను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ద్వారా పరేడ్ గ్రౌండ్స్‌లో పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని గన్‌పార్క్, క్లాక్ టవర్, ఫతేమైదాన్‌లను విద్యుద్ధీకరించాలని సూచించారు. రహదారులు, భవనాల శాఖ ద్వారా బ్యారికేడింగ్,సీటింగ్, సైనేజ్‌లతో పాటు రాజ్ భవన్, సెక్రటేరియట్, అసెంబ్లీ, హైకోర్టు, చార్మినార్‌లతో పాటు చారిత్రక ప్రాధాన్యత భవనాలను విద్యుత్ దీపాలను దగ దగలాడేలా అలంకరించాలన్నారు. విద్యుత్ శాఖ ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా, మెట్రో వాటర్ వరక్స్ ద్వారా మంచినీటి సరఫరా, సమాచార శాఖ ద్వారామీడియా కు ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎల్ఈడిటివిలు, వ్యాఖ్యాతల నియామకం, వేడుకల ప్రత్యక్ష ప్రసారానికి తగు ఏర్పాట్లు చేయాలన్నారు.

ఉద్యానవన శాఖ ద్వారా పరేడ్ గ్రౌండ్‌లో పుష్పాలతో అలంకరణ వినూత్నంగా ఉండాలని సూచించారు. ఈ వేడుకలకు హాజరయ్యే పాఠశాల విద్యార్థుల కోసం ఆర్టీసి ద్వారా ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేయాలని అదేశించారు. స్టేడియం సమీపంలో అంబులెన్స్, అగ్నిమాపక ఏర్పాట్లు ఉండాలన్నారు. అమర వీరుల సైనిక స్మారక్ వద్ద తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పుష్పగుచ్ఛం సమర్పించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిఏడి ముఖ్యకార్యదర్శి అధర్ సిన్హా, రహదారులు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, జీహెచ్ఎంసీ కమీషనర్ దానకిశోర్, శ్రీనివాస్, వింగ్ కమాండర్, కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్ ఫేర్, హైదరాబాద్ పోలీస్ కమీషనర్ అంజనీకుమార్, అడిషనల్ డిజి జితెందర్, ఎం.కె.సింగ్, అభిలాష్ బెస్త్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ గోపికృష్ణ, హైదరాబాద్ కలెక్టర్ రఘునందన్ రావు, ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్ సింగ్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండి రఘుమారెడ్డి, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, సమాచార శాఖ చీఫ్ ఇన్ ఫర్ మేషన్ ఇంజనీర్ కిషోర్ బాబు, మిలిటరీ, కంటోన్మెంట్ బోర్డ్, అగ్నిమాపక, స్కౌట్ అండ్ గైడ్స్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఏకగ్రీవాల జోరు

(మొదటిపేజీ తరువాయి)

వర్గాలు కూడా జన్మభూమి రుణం తీర్చుకుంటామంటూ లక్షల వ్యయం లెక్కచేయకుండా పంచాయతీ ఎన్నికలకు సిద్దపడుతున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న వారు కూడా పంచాయతీ ఎన్నికల్లో పోటీ పడేందుకు తహతహలాడుతున్నారు. పంచాయతీ ఎన్నికలు లక్షల వ్యయంతో కూడుకున్నవని భావించిన గ్రామాల్లోని చైతన్య వంతమైన యువత మాత్రం పెద్దగా ఆసక్తి కనబర్చలేక పోతున్నారు. గ్రామంలోనే ఉండి అందరి మన్ననలు అందుకుంటున్న వారు కూడా లక్షల వ్యయం చేసి ఎన్నికల్లో పోటీ చేయడం సాధ్యం కాదని చేతులెత్తేస్తున్నారు. ఎంత ప్రజాభిమానం ఉన్నా చివరికి డబ్బే ప్రధానం అని తేలడంతో ఈ ఎన్నికల్లో లక్షలు వ్యం చేసేవారే పోటీ పడే పరిస్థితులు గ్రామాల్లో నెలకొన్నాయి.

ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం రూ. 10 లక్షల ప్రోత్సాహకం ఇస్తుంది. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని కొంత మంది యువ ఎమ్మెల్యేలు నియోజక వర్గం నిధి నుండి ఏక గ్రీవ గ్రామ పంచాయతీలకు రూ. 10 నుండి రూ. 15 లక్షల వరకు ఇవ్వడానికి ముందుకొస్తున్నారు. మరి కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీ చేయాలనే ఆసక్తితో ఉన్నవారు కూడా ఏక గ్రీవంగా ఎన్నుకున్న పక్షంలో గ్రామాభివృద్ధికి రూ. 25 లక్షల వరకు ఇస్తామని హామీ ఇస్తున్నారు. ఈ విధంగా రాజకీయంగా గట్టి అభ్యర్థులు ఉన్న గ్రామాల్లో మినహా ఇతర గ్రామాల్లో అత్యధికులైన ప్రజలు ఏకగ్రీవాలవైపు మొగ్గు చూపుతున్నారు.



ఇప్పటికే తొలి విడత ఎన్నికలు జరగాల్సిన గ్రామాల్లో కొన్ని ఏకగ్రీవాలు జరిగాయి. బుధవారం మరికొన్ని గ్రామాల్లో ఏకగ్రీవాలు జరిగాయి. తొలి విడత ఎన్నికలు జరుగనున్న జనరల్ కేటగిరి గ్రామాల్లో డబ్బున్నవారిదే హవా అన్నట్లుగా రాజకీయాలు జోరందుకుంటున్నాయి. మొదటి విడత 4,480 గ్రామాలకు ఈ నెల 21న ఎన్నికలు జరగనున్నాయి. కనీసం 2 వేల గ్రామాలను ఏకగ్రీం చేయాలనే ఆలోచనతో అధికార టీఆర్ఎస్ చర్యలు చేపట్టింది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఇప్పటికే రంగంలోకి దిగారు. గ్రామాల్లో పర్యటిస్తున్నారు. టీఆర్ఎస్ బలంగా ఉన్న గ్రామాల్లో ఏకగ్రీవాలకు ప్రోత్సహిస్తున్నారు. గ్రామాభివృద్ధికి అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. ఇరు వర్గాలను సంతృప్తి పరిచే విధంగా లోపాయికారి వ్యవహారాలకు తెరలేపుతున్నారు. కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీల్లో ఏకగ్రీవాలు అధికారం కావాలనే పార్టీ ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా నాగ్వారం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా లక్ష్మిని ఎన్నుకొనేందుకు గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే మూడు గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. ఇబ్రహీంపూర్, జే పీ తండా, కంగుల్ గ్రామాలలో పంచాయతీ ఎన్నికను ఏకగ్రీవం చేసుకున్నారు. జనగామ జిల్లాలోని మరియాపురం, నర్సాపూర్, అబ్దుల్ నాగారం గ్రామ సర్పంచులను ఏకగ్రీవ చేసుకొనేందుకు అంగీకారానికి వచ్చారు. దుబ్బాకలోని వెంకటగిరి తండా, మిరదొడ్డి మండలం బేగంపేట గ్రామ సర్పంచ్‌ను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదాద్రి జిల్లా లప్పనాయక్ తండా ఏకగ్రీవమైంది. వనపర్తి జిల్లాలోని 10గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవ పంచాయతీలకు రూ. 10 లక్షల చొప్పున అభివృద్ధి నిధి ఇవ్వడానికి స్థానిక ఎమ్మెలే నిరంజన్‌రెడ్డి ముందుకొచ్చారు. కర్నెతండా, ఈర్లతండా, అల్లమయ్యపల్లి. సూరాయిపల్లి, అంతాయపల్లి, కోతులకుంట తండా, ఆముదం బండ తండా, మల్కిమియాన్ పల్లి, సల్కలాపూర్ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మరి కొన్ని జిల్లాల్లో కూడా ఏకగ్రీవాలు జరుగుతున్నాయి. రాష్ట్ర స్థాయిలో రాజకీయంగా ప్రతిపక్షానికి స్థానం లేకుండా చేసిన టీఆర్ఎస్ అధినాయకత్వం గ్రామాల్లో కూడా ప్రతిపక్షాలకు స్థానం లేకుండా చేయాలనే ఆలోచనతో ఏకగ్రీవాలను ప్రోత్సహిస్తుంది.

100 కోట్లు కట్టండి

(మొదటిపేజీ తరువాయి)

కనపడలేదని అన్నారు. ఆ ఎసెస్‌మెంట్ సంవత్సరంలో రాహుల్‌గాంధీ తనకు కేవలం రూ. 68.1 లక్షల ఆదాయాన్ని ప్రకటించారని, అదే సమయంలో ఆయన పార్టీ సభ్యుడు ఆస్కార్ ఫెర్నాండెజ్ మాత్రం రూ. 48.9 కోట్లు చూపారని ఐటీ వర్గాలు చెప్పాయి. రాహుల్, సోనియాల ఆదాయపన్ను అంచనా కేసును మళ్లీ తెరవడంపై కాంగ్రెస్ నేతలు ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోనియాగాంధీ రూ. 44 కోట్ల పన్ను కట్టాలని తప్పుగా చూపించారని ఆమె తరపున వాదిస్తున్న పి.చిదంబరం తెలిపారు. రూ. 141 కోట్ల ఏజేఎల్ ఆదాయాన్ని తమ రిటర్నులు దాఖలు చేసేటపుడు చూపించలేదని.. దాన్ని తప్పించుకున్నారంటూ వాళ్లు చెప్పారని ఆయన అన్నారు. సోనియా, రాహుల్, ఆస్కార్ ఫెర్నాండెజ్‌లపై 2011-12లో వారి ఆదాయాన్ని మళ్లీ లెక్కించిన తర్వాత డిసెంబరు 31న ఎసెస్‌మెంట్ ఉత్తర్వులు ఇచ్చారని, ఆదాయపన్ను శాఖ తీసుకున్న చర్యలు చెల్లుబాటు అవుతాయో లేదో కోర్టు పరిశీలిస్తున్నందున ఈ ఉత్తర్వులను తాత్కాలికంగా పెండింగులో పెట్టారని చెప్పారు. ఆదాయపన్ను శాఖ అధికారులు కనీసం లోకజ్ఞానంతో కూడా వ్యవహరించలేదని, యంగ్ ఇండియన్ అనే స్వచ్ఛంద సంస్థలోని 1900 షేర్లకు బదులుగా ఆమె రూ. 141 కోట్ల ఆదాయం పొంది, దాన్ని చూపించలేదంటున్నారని జస్టిస్ ఏకే సిక్రీ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట చిదంబరం వాదించారు. యంగ్ ఇండియన్ షేర్ల వివరాల గురించి వెల్లడించడానికి తమకు ఇబ్బంది ఏమీ లేదని, అవేవీ కంపెనీ ప్రయోజనానికి లోబడినవి కావని అన్నారు. స్వచ్ఛంద సంస్థ అయిన యంగ్ ఇండియన్‌లో షేర్లవల్ల వచ్చిన ప్రతిఫలాన్ని అసలు చూపించాల్సిన అవసరం లేదని, ఇలాంటి కంపెనీ ఆస్తుల నుంచి వాటాదారులకు ఎలాంటి డివిడెండ్లు, వడ్డీలు రావని చిదంబరం తెలిపారు. కంపెనీకి ఉన్న ఏకైక ఆస్తి కేవలం రూ. 90 కోట్ల అప్పేనని, కానీ ఐటీ శాఖ మాత్రం దాన్ని తప్పుగా లెక్కించి రూ. 407 కోట్ల ఆస్తిగా చూపించిందని అన్నారు. కేసు తదుపరి విచారణ ఈనెల 29వ తేదీకి వాయిదా పడింది.

రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు నేషనల్ హెరాల్డ్ కేసులో 2011-12 సంవత్సరానికి సంబంధించిన ఎసెస్‌మెంట్ ఉత్తర్వులను జారీచేశామని ఆదాయపన్ను శాఖ సుప్రీంకోర్టుకు తెలిపింది. వారిద్దరి నుంచి పన్ను బకాయిలు రాబట్టేందుకు ఎసెస్‌మెంట్ ఉత్తర్వులు ఇవ్వడానికి సుప్రీంకోర్టు కూడా అంగీకరించింది. సీబీడీటీ సర్క్యులర్‌పై నాలుగు వారాల్లోగా అఫిడవిట్ దాఖలుచేయాలని సోనియా, రాహుల్ గాంధీలకు జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్, జస్టిస్ ఎంఆర్ షాలతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఆదాయపన్ను శాఖ కూడా ఆ అఫిడవిట్, సర్క్యులర్‌లకు ఆ తర్వాత వారం రోజుల్లోగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. కోర్టు ఈ విషయంలో ఇంతకు ముందు జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని, తదుపరి విచారణ ఈనెల 29న జరుగుతుందని తెలిపింది. కాగా ఇదే కేసులో.. ఇదే సంవత్సరానికి సంబంధించి (2011-12) యంగ్ ఇండియన్ సంస్థకు రూ. 249.15 కోట్ల డిమాండ్ నోటీసును కూడా ఆదాయపన్ను శాఖ ఇంతకుముందే పంపింది.

జగన్ వంటి నేతను చూడలేదు:
భానుచందర్

శ్రీకాకుళం/ ఇచ్ఛాపురం, జనవరి 9 (మనం న్యూస్ బ్యూరో):జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో సినీ నటుడు భానుచందర్ వైఎస్సార్ సీపీలో చేరారు. జగన్ పార్టీ కండువా కప్పి భానుచందర్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రజా సంకల్పయాత్ర ముగింపు ఘట్టంలో పాల్గొన్న భానుచందర్ మాట్లాడుతూ.. ప్రజల కోసం తపించే వైఎస్ జగన్ లాంటి నాయకుడిని ఇప్పటి వరకు చూడలేదని అన్నారు. జనంతో ఇంతగా కలిసిపోయే నాయకుడు వైఎస్ జగన్ ఒక్కరేనని.. ఆయనకు ఎవరూ సాటి రారని పేర్కొన్నారు. 2019 నుంచి 20 సంవత్సరాల పాటు వైఎస్ జగనే ముఖ్యమంత్రిగా కొనసాగుతారంటూ వ్యాఖ్యానించారు.

కాగా కొన్నిరోజుల క్రితమే భానుచందర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. శ్రీకాకుళం జిల్లాలో సాగిన ప్రజాసంకల్పయాత్రలో భాగంగా గతేడాది డిసెంబరులో జగన్‌ను భానుచందర్ కలిశారు. ఆరోజే ఆయన పార్టీలో చేరే విషయంపై చర్చించారు.

25 జిల్లాలు చేస్తా

పేద ప్రజలకు.. గుండె చప్పుడునవుతా

ప్రజాసంక్షేమం కోసం కడదాకా జీవిస్తా

పాదయాత్రలో మీ కష్టాలు తెలుసుకున్నా

నడిచింది నేను.. కానీ నడిపించింది మీరే

మేమొస్తే ప్రజలకు ఇంకా చేరువగా పాలన

గ్రామానికో సచివాలయం.. ఇంటికే పథకాలు

పాదయాత్ర ముగింపు సభలో జగన్మోహన్‌రెడ్డి

(మనం న్యూస్‌బ్యూరో, శ్రీకాకుళం/ ఇచ్ఛాపురం)



అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాలను 25 జిల్లాలుగా చేస్తానని వైఎస్ఆర్‌సీపీ అధినేత, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. పంట పెట్టుబడికి ఎకరాకు ఏడాదికి రూ. 12,500 చొప్పున ఇస్తామని, పంట బీమాను పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తుందంటూ రైతులపై వరాలజల్లు కురిపించారు. ప్రతి గ్రామంలో సచివాలయం ఏర్పాటుచేసి.. ప్రజలకు అత్యంత చేరువగా పాలన తీసుకొస్తామన్నారు. గ్రామ వలంటీర్లను నియమించి.. వారితో లబ్ధిదారుల ఇంటి ముంగిటకే పథకాలన్నీ అందజేస్తామని తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ రెంటు రూపాయిన్నరకే ఇస్తామని అన్నారు. 341 రోజుల పాటు రాష్ట్రంలోని 13 జిల్లాలలో 134 నియోజకవర్గాలు.. 2,516 గ్రామాలలో సాగిన 'ప్రజాసంకల్ప యాత్ర' ముగిసిన సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో బుధవారం ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. మొత్తం 3,648 కిలోమీటర్ల దూరం ఆయన నడిచారు. పాదయాత్రలో భాగంగా 124 బహిరంగ సభలలో పాల్గొనడంతో పాటు.. 55 ఆత్మీయ సమ్మేళనాలు కూడా నిర్వహించారు. ఇన్నివేల కిలోమీటర్ల పాదయాత్రలో.. ప్రజల గుండెచప్పుడునే తన గుండె చప్పుడుగా మార్చుకున్నానని బహిరంగ సభలో ఆయన చెప్పారు. ప్రజల ఆశీర్వాదమే తనకు అండ..దండగా నిలిచిందని తెలిపారు. తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దీవెనలతో పాటు దేవుని ఆశీస్సులతో ముందుక్ సాగుతున్నానన్నారు. ప్రజా సంకల్పయాత్ర ముగింపు సందర్భంగా ఇచ్ఛాపురంలోని పాతబస్టాండ్ వద్ద నిర్వహించిన బహిరంగ సభకి తరలివచ్చిన అశేష జనవాహినిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

సీఎం.. అంటూ మార్మోగిన నినాదాలు

జగన్ తన ప్రసంగం ప్రారంభించడానికి ఉద్యుక్తులు అవుతుండగానే, ఒక్కసారిగా అక్కడున్న అశేష ప్రజానీకం 'సీఎం.. సీఎం' అంటూ దిక్కులు మార్మోగేలా నినాదాలు చేసి ఆయనను ఉత్సాహపరిచారు. అనంతరం జగన్ మాట్లాడుతూ, నడిచింది తానైనా.. నడిపించింది మాత్రమే మీరేనన్నారు. హైదరాబాద్ నుంచి దుబాయ్ 3 వేల కిలోమీటర్లు.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా దూరం 3440 కి.మీ. అని.. పాదయాత్ర ఆ రికార్డులన్నింటినీ దాటేసిందని చెప్పారు. ఎంత దూరం నడిచాం అన్నది ముఖ్యం కాదని.. ఎంతమంది ప్రజలను కలిశాం, ఎందరికి భరోసా ఇచ్చామన్నదే ముఖ్యమని అన్నారు. 600 హామీలు ఇచ్చి.. ప్రతీ కులాన్నీ ఎలా మోసం చేయవచ్చన్న విషయంలో పీహెచ్‌డీ చేసిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని విమర్శించారు. రాష్టంలో కరువు పరిస్థితులుంటే.. రెయిన్‌గన్‌ల పేరుతో చంద్రబాబు సినిమా చూపించారంటూ అనంతపురం జిల్లాకు చెందిన రైతు శివన్న యథార్థ గాధ వినిపించారు. జాతీయ రాజకీయాల పేరుతో కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్ తిరుగుతారు కానీ.. మన రాష్ట్రంలో రైతన్నల కష్టాలను తీర్చాలన్న ధ్యాసే చంద్రబాబుకు లేదన్నారు. వ్యవసాయ ఆదాయంలో మన రాష్ట్ర రైతులు దేశంలోనే 28వ స్థానంలో, అప్పుల్లో రెండో స్థానంలో ఉంటే.. గ్రోత్ రేట్ లో నెంబర్ 1 అంటూ చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారన్నారు. పొదుపు సంఘాలకు చెందిన అక్కచెల్లెమ్మల రుణాలు చంద్రబాబు అధికారంలోకి వచ్చే నాటికి రూ. 14,2014 కోట్లు ఉంటే... ఇప్పుడు వాటి వడ్డీలు పెరిగిపోయి రూ. 22,174 కోట్లకు చేరాయని, సున్నా వడ్డీ రుణాలకు కూడా బాబు ఎగనామం పెట్టాడన్నారు. రాష్ట్ర విభజన సమయంలో 1.42 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే.. ఇప్పుడవి 2.40 లక్షలకు పెరిగినా.. ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదన్నారు. ప్రతి ఇంటికీ రూ. 2వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని ఎన్నికలకు ముందు చెప్పి.. ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు మూడు, నాలుగు నెలల ముందు, అదీ కొద్దిమందికే వెయ్యి ఇస్తానంటున్నాడని విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక.. అక్షరాలా 6 వేల ప్రభుత్వ స్కూళ్లు మూసేశారని.. ఎస్సీ, ఎస్టీల హాస్టళ్లు మూతపడ్డాయని.. కవిటి మండలంలో ఓ జూనియర్ కాలేజీలో కనీసం బాత్రూంలు కూడా లేవని ఓ విద్యార్థిని తనకు చెప్పిందని సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజులు కట్టలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో 23వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. ఉన్న బడుల్లో టీచర్లు లేరు, పుస్తకాలు ఇవ్వటం లేదని, ఇలా ప్రభుత్వ స్కూళ్ళను నిర్వీర్యం చేస్తూ.. నారాయణ, చైతన్య సంస్థలను మాత్రం పెంచుతున్నారని మండిపడ్డారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు 8 నెలలుగా బకాయిలు చెల్లించకపోవడంతో.. ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయని తెలిపారు. ఉద్దానంలో 4 వేల మంది కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకుంటా ఉంటే.. కేవలం 1400 మందికి మాత్రమే ప్రభుత్వం వైద్యం అందిస్తోందని, పింఛన్లు కూడా 370 మందికే ఇస్తోందని జగన్ అన్నారు. 108 అంబులెన్స్ వస్తుందో.. రాదో తెలియని పరిస్థితి ఉందని తెలిపారు. జన్మభూమి కమిటీల పేరుతో మాఫియా నడుస్తోందని, రేషన్ కార్డు నుంచి మరుగుదొడ్డి వరకూ ఏది కావాలన్నా.. లంచం తప్పట్లేదని మండిపడ్డారు. పెన్షన్ కావాలంటే ఏ పార్టీ అని అడుగుతున్నారు. పెన్షన్ కావాలంటే బతికి ఉన్నా.. సర్టిఫికెట్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఎన్నికలొచ్చేటప్పటికి చంద్రబాబుకు భయం పట్టుకుందని, అందుకే ఆదరణ-2 అని, కొత్త ఇళ్ళు, పెన్షన్లు.. మరొకటి అని డ్రామాలు ఆడుతూ కొత్త సినిమా చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు.

నాయకులను పంపేయండి..

ఎన్నికల ముందు తాము చెప్పింది చేయపోతే.. ఆ నాయకుడితో రాజీనామా చేయించి ఇంటికి పంపేసేలా చేయాలని జగన్ అన్నారు. రాష్ట్రంలో అలాంటి విశ్వసనీయ రాజకీయాలు రావాలని, చెడిపోయిన ఈ రాజకీయ వ్యవస్థను మార్చాలంటే.. అది జగన్ ఒక్కడి వల్ల సాధ్యపడదని.. జగన్‌కు మీ అందరి దీవెనలు కావాలని కోరారు. ప్రతి పథకం ప్రతి పేదవాడి ఇంటికి చేరాలని.. ఆ పేదవాడు ఏ పార్టీ, ఏ కులం, మతం, అనేది అడ్డు కాకూడదని చెప్పారు.

నేనేం చేస్తానంటే...

తమ పార్టీ అధికారంలోకి వస్తే 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌ను 25 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తామని వైఎస్ జగన్ చెప్పారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్నీ ఒక జిల్లాగా చేస్తానని, ఇలా వాబుదారీతనం పెంచుతామని అన్నారు. కలెక్టర్లను ప్రజలకు మరింత చేరువ చేస్తామని, దాంతో పాలన కూడా చేరువ అవుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ గ్రామ సచివాలయాన్ని తీసుకొస్తామని, స్థానికులకే 10 మందికి ఉద్యోగాలు ఇసామని.. ప్రతి పథకం పేదవాడి ఇంటి ముందుకే వచ్చేలా చేస్తానని అన్నారు. ప్రతి 50 ఇళ్లకు ఒకరికి గ్రామ వాలంటీర్‌గా తీసుకొని వీరికి రూ. 5 వేలు జీతం ఇస్తామని చెప్పారు. వాళ్లు ఆ 50 ఇళ్లకు జవాబుదారీగా ఉండి, నవరత్నాల నుంచి రేషన్ బియ్యం వరకూ.. నేరుగా ఇంటికే వచ్చేలా డోర్ డెలివరీ చేస్తారన్నారు. రైతులకు పగటిపూటే 9 గంటలపాటు ఉచితంగా కరెంటు ఇస్తామని.. ప్రతి రైతు ఆదాయం పెంచడానికి.. బ్యాంకు రుణాలపై వడ్డీ లేకుండా సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తామని అన్నారు. మే నెలలోనే రైతన్నకు పెట్టుబడి కోసం ఏడాదికి రూ. 12,500 ఇస్తామని, రైతులందరికీ బోర్లు ఉచితంగా వేయిస్తామని, పంట బీమాను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. ఆక్వా రైతుకు రూపాయిన్నరకే కరెంటు ఇస్తామని, గిట్టుబాటు ధరల కోసం రూ.3000 కోట్లతో ధరల స్థిరీకరణ తీసుకొస్తామని.. ప్రతి మండలంలోనూ కోల్డ్‌స్టోరేజీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.పాడి ప్రోత్సాహం కోసం.. లీటరుకు రూ. 4 బోనస్ ఇస్తామని, సహకార రంగం డైరీలను ప్రతి జిల్లాలో ప్రోత్సహిస్తామని చెప్పారు. వ్యవసాయ ట్రాక్టర్లకు రోడ్‌ట్యాక్స్‌ను పూర్తిగా రద్దు చేస్తామన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు రైతు నష్టపోకుండా.. రూ. 4 వేల కోట్లతో ప్రత్యేక నిధి పెడతామన్నారు. కొబ్బరి చెట్లకు పరిహారం రూ. 3 వేలు, జీడిమామిడి చెట్లకు ఇప్పుడు ఇస్తున్న రూ. 30 వేలను రూ.50 వేలకు పెంచుతామని చెప్పారు. రైతన్నకు జరగకూడని నష్టం ఏమైనా జరిగితే.. వైయస్ఆర్ బీమా కింద రూ. 5 లక్షలు వెంటనే ఆ కుటుంబానికి ఇస్తామని.. అది పూర్తిగా ఆడపడుచులకు ఇచ్చే సొత్తుగా చూసేలా అసెంబ్లీలో చట్టం చేస్తామని, దాంతో అప్పుల వాళ్ళు లాక్కొనే అవకాశం ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేతలు ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, తలశిల రఘురాం, ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యన్నారాయణ, భూమన కరుణాకర్‌రెడ్డి, తమ్మినేని సీతారాం, ధర్మాన కృష్ణదాస్, దువ్వాడ శ్రీనివాస్, పిరియా సాయిరాజ్, గొర్లె కిరణ్‌కుమార్, పేరాడ తిలక్‌లతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన పార్టీ అగ్రనేతలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.




నిర్మాణంలోని ఆసుపత్రిలో భారీ మంటలు..

(మొదటిపేజీ తరువాయి)

విషమంగా ఉంది. మొత్తం 10 అగ్నిమాపక వాహనాలు రంగంలోకి దిగినా మంటలు త్వరగా అదుపులోకి రాలేదు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్టు భావిస్తున్నారు. బుధవారం ఉన్నట్టుండి ఉదయం 10 గంటల సమయంలో నల్లని దట్టమైన పొగలు ఇక్కడి నిర్మాణంలో ఉన్న 10 అంతస్థుల భవనంలో అలముకున్నాయని ప్రత్యక్ష సాక్షి వివరించాడు. సైనికులు కూడా మంటలార్పేందుకు అగ్నిమాపక బృందాలకు సహకరించడంతో మధ్యాహ్నం 3 గంటల తరువాత మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. నిజానికి ఈ భవన నిర్మాణంలో 400 మంది కూలీలు పనిచేస్తుండగా, భోజనం కోసం వీరంతా కింది అంతస్తులో ఉండడంతో అతిపెద్ద ప్రమాదం తప్పినట్టు నాగపూర్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారి వెల్లడించారు. మూడవ అంతస్థులోని ఆడిటోరియంలో ఇంటీరియర్ పనులు జరుగుతున్న సమయంలో మంటలు చెలరేగగా ఆ ప్రాంతమంతా అలముకున్న దట్టమైన పొగలతో కాసేపు ఏమీ కనిపించకుండా పోయింది. వెల్డింగ్ పనుల్లో ఎగిరే నిప్పు కణికలతో ప్రమాదం జరిగి ఉండచ్చని మరికొందరు భావిస్తున్నారు. గత నెల 27, 29న ముంబై నగరంలో జరిగిన రెండు పెద్ద అగ్నిప్రమాదాల్లో ఏడుగురు మరణించగా, మరో ప్రమాదంలో 12 మంది అగ్నమాపక సిబ్బంది గాయపడ్డారు.

అలోక్‌వర్మ బాధ్యతల స్వీకరణ

(మొదటిపేజీ తరువాయి)



తెలిసిందే. దీన్ని సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మంగళవారం ధర్మాసనం ఆలోక్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఎంపిక కమిటీ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఆయన్ను అధికారం నుంచి తొలగించే అధికారం ప్రభుత్వానికి లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సీబీఐ స్వతంత్రతను కాపాడేందుకు, సీబీఐ డైరెక్టర్ అధికారాలకు నిరోధం కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సబీఐ డైరెక్టర్‌గా తిరిగి బాధ్యతలు చేపట్టే క్రమంలో ఆలోక్ వర్మ.. విధాన పరమైన ప్రధాన నిర్ణయాలేవీ తీసుకొనే అవకాశం ఉండదని కోర్టు స్పష్టం చేసింది. ఆయన కొనసాగింపుపై అత్యున్నత స్థాయి ఎంపిక కమిటీ నిర్ణయం వెలువరించే వరకూ ఈ నిబంధన వర్తిస్తుందని వెల్లడించింది. ఇందుకోసం ఎంపిక కమిటీకి కోర్టు వారం రోజుల సమయం ఇచ్చింది. సీబీఐ డైరెక్టర్‌గా ఆలోక్ వర్మ రెండేళ్ల పదవీ కాలం జనవరి 31తో ముగియనుంది.



పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన మారెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రాజెక్టులపై అధికారులతో ఉపరాష్ట్రపతి చర్చలు

- రేణిగుంట నుంచి వెంకటాచలం(నెల్లూరు) వరకూ రైలులో ప్రయాణించిన వెంకయ్యనాయుడు
- ఆ సమయంలో రైల్వే అధికారులతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రైల్వే ప్రాజెక్టులపై భేటీ
- నడికుడి - శ్రీకాళహస్తి మార్గం పనుల గురించి ప్రత్యేక చర్చ



హైదరాబాద్, జనవరి 9(మనం ప్రతినిధి): ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అత్తగారి దశదిన కార్యక్రమాల కోసం ఢిల్లీ నుంచి నెల్లూరు బయలు దేరారు. ఢిల్లీ నుంచి రేణి గుంట విమానాశ్రయం చేరుకుని, అక్కడ నుంచి రైలు మార్గంలో వెంకటాచలం (నెల్లూరు) చేరుకున్నారు. ఉపరాష్ట్రపతి రైలు ప్రయాణం చేయడమే కాకుండా, ఆ సమయాన్ని పలు రైల్వే ప్రాజెక్టుల గురించి అధికారులతో మాట్లాడేందుకు కేటాయించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు రైల్వే ప్రాజెక్టులు చర్చకు వచ్చాయి. ఈ సమా వేశానికి జనరల్ మేనేజర్ శ్రీ ఆర్.కె.కులశ్రేష్ఠ, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ శ్రీ శివప్రసాద్, డి.ఆర్.ఎమ్. శ్రీ విజయ్ ప్రతాప్ సింగ్, ఆర్వీఎన్ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ కమలాకర్ రెడ్డి హాజరయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం రవాణా సౌకర్యాలు కీలకమనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని, నూతన రైల్వే ప్రాజెక్టులతో పాటు ప్రస్తుతం ముందుకు సాగుతున్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. ముఖ్యంగా కృష్ణ పట్నం-ఓబులవారిపల్లె రైల్వే లైను మరియు నడికుడి-శ్రీకాళహస్తి రైలు మార్గం పనుల గురించి ప్రత్యేకంగా అధికారులతో చర్చించారు.వీటితో పాటు గూడూరు విజయవాడ మూడో లైను, గుంటూరు-అమరావతి-విజయవాడ రైల్వేలైను, గుంతకల్లు స్టేషన్, నెల్లూరు నూతన స్టేషన్లతో పాటు గూడూరు, రేణిగుంట స్టేషన్లలో వైఫై సౌకర్యం గురించి చర్చించారు. వీటితో పాటుగా ఈ మధ్య రైల్వే ప్రవేశపెట్టిన సువిధ డైనమిక్ ఫెయిర్ ట్రైన్స్ గురించి కూడా మాట్లాడారు. వీటిలో టిక్కెట్టు ధరలు మరీ ఎక్కువగా ఉన్నాయనే వార్తలు వినిపిస్తున్నాయని, మధ్యతరగతికి సౌకర్య వంతంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నెల్లూరు కడప జిల్లాల మధ్య ముడిసరుకుల రవాణా మరియు ప్రయాణ సౌకర్యాలు, కృష్ణపట్నం పోర్టు ద్వారా ఎగుమతులు, దిగుమతులకు ఉద్దేశించిన కృష్ణపట్నం-ఓబుల వారి పల్లె రైల్వే లైన్ సొరంగం పనుల గురించి గతంలోనే రైల్వే మంత్రి శ్రీ పీయూష్ గోయల్‌ని తన ఛాంబర్ కు పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడారు. అప్పట్లో రైల్వే బోర్డు ఛైర్మన్ లోహాని,ఆర్వీఎన్ఎల్ ముఖ్య అధికారి ప్రదీప్‌గౌర్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ ప్రాజెక్టు ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి కానున్నట్లు ఉపరాష్ట్రపతికి పూర్తి వివరాలను రైల్వే అధికారులు తెలియజేశారు. ప్రస్తుతం ఆ పనుల గురించి మరో సారి ఉపరాష్ట్రపతి రైల్వేఅధికారులతో చర్చించారు. ముందుగా తెలియజేసినట్లుగా ఫిబ్రవరి చివరి నాటికి పనులు పూర్తి అయ్యేలా చూడాలనిసూచించారు. రాయలసీమ మరియు కోస్తా ప్రాంతాలను కలుపుతూ, కడప-నెల్లూరు మధ్య ముడిసరుకుల రవాణా కోసం ఉద్దేశించిన ఈ ర్వైల్వే లైనును ప్రజా రవాణా కోసం కూడా అందుబాటులో తెచ్చేందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి, సానుకూలమైన నిర్ణయాన్ని తీసుకునే దిశగా ఆలోచించాలని ఉపరాష్ట్రపతి గతంలోనే రైల్వే మంత్రికి సూచించారు. ఈ విషయాన్ని అధికారులకు కూడా వివరించి, దానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

నడికుడి - శ్రీ కాళహస్తి రైల్వే లైను విషయంలోనూ ఉపరాష్ట్రపతి, రైల్వే అధికారులతో మాట్లాడారు. పనుల వేగం, ఏ సమయానికి పూర్తి కావొచ్చు తదితర అంశాల గురించి అడిగిన ప్రశ్నలకు రైల్వే అధికారులు వివరాలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం 2016 ఆగష్టులో 45 కి.మి విస్తీర్ణం కలిగిన భూమిని పిడుగురాళ్ళ - సవలాయ పురం మధ్య అందించిందని, అయితే అందులో రెండు చోట్లు భూమి విషయంలో వివాదాలు తలెత్తి, ప్రస్తుతం అది హైకోర్టులో వివాదం నడుస్తోందని, దీని మీద రాష్ట్ర ప్రభుత్వం వివరాలు అందించాల్సి ఉందని తెలిపారు. అధేవిదంగా పిడుగురాళ్ళ-రొంపిచర్ల మధ్య వివాదంలో ఉన్న భూమి మినహా మిగిలిన ప్రదేశంలో పనులు పూర్తి అయ్యాయని, వివాదాలు తేలిన తర్వాత మిగిలిన చోట కూడా పని పూర్తి చేయనున్నట్లు తెలిపారు.అదేవిధంగా ఇప్పటికే పూర్తైన రైల్వే లైను విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పలు కేంద్ర మంత్రిత్వ శాఖల నుంచి ఆమోదం రావలసి ఉందని తెలిపారు. ఈవిషయంలో వెంటనే చొరవ తీసుకోవాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తిఅయ్యేలా చూడాలని సూచించారు. క్లియరెన్స్ రావలసిన కేంద్ర మంత్రిత్వ శాఖలతో తానుమాట్లాడతానని తెలిపారు.ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నడుస్తున్న అన్ని రైల్వే ప్రాజెక్టుల గురించి చర్చించి, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వీటికి కావలసిన సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తేవాలన్నారు.అవసరమైన శాఖ ల మంత్రులతో తాను మాట్లాడతానని, ప్రజల సౌకర్యాల ను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేయాలని తెలిపారు.

ఇంటీరియర్ డెకరేషన్‌పై శిక్షణ

హైదరాబాద్, జనవరి 9 (మనం ప్రతినిధి): జనవరి 23వ తేదీ నుంచి ఫిబ్రవరి 12వరకు ఇంటీరియర్ డేకరేషన్ అంశంలో 21రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గృహ విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ డా.విజయలక్ష్మి తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటనలో పేర్కొంటూ వనరుల యాజమాన్యం, వినియోగదారుల శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈశిక్షణా కార్యక్రమం నిర్వహిస్తారు. 15సంవత్సరాలు పైబడిన పదవ తరగతి ,ఆపైన విద్యార్హతలు కలిగిన యువతులను మాత్రమే ఈశిక్షణకి అర్హులని ఆమె పేర్కొన్నారు. ప్రొపెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని గృహ విజ్ఞాన కళాశాల, సైఫాబాద్‌లో ప్రతిరోజు ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 2.30 గంటలవరకు ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఆసక్తి కల్గిన అభ్యర్దులు రూ.10వేల ఫీజుతో కళాశాలనందు సంప్రదించాలని తెలియజేశారు.

సుర్జేవాలాతో దాసోజు భేటీ



హైదరాబాద్, జనవరి 09 (మనంప్రతినిధి): ఎఐసీసీ సమాచార విభాగం ఇంచార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలను ఎఐసీసీ అధికార ప్రతినిధి శ్రవణ్ దాసోజు బధవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. తనను ఎఐసీసీ అధికార ప్రతినిధిగా నియమించినందుకు సుర్జేవాలాకు దాసోజు కృతజ్ఞతలు తెలియజేశారు.తనను అధికార ప్రతినిధిగా నియమించినందుకు బాధ్యత, అంకితభావంతో పని చేస్తానని ఈ సందర్భంగా దాసోజు చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మీడియా, కమ్యూనికేషన్స్ విభాగం చేపట్టాల్సిన అంశాలపై వారిద్దరు చర్చించారు.

టీపీసీసీ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అన్వేష్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 09 (మనంప్రతినిధి): టీపీసీసీ కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్‌గా ప్రస్తుత వైస్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డిని ఎఐసీసీ నియమించింది. ఈ మేరకు ఎఐ సీసీ ప్రధాన కార్యదర్శి అశోక్ గెహ్లాట్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు ముందు కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్న కోదండరెడ్డిని జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా నియమించిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో అన్వేష్ రెడ్డిని నియమించారు. తనను ఛైర్మన్‌గా నియమించినందుకు ఎఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అన్వేష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

చిప్పోలు, మేర కులానికి పర్యాయ పదంగా మేరు పదాన్ని బీసీ జాబితాలో చేర్చాలి

- మేరు సంఘం ప్రతినిధులు

హైదరాబాద్, జనవరి09(మనంప్రతినిధి): వ్యవహారికంగా మేరోల్లు, మేరు అనే పేరుతో పిలువబడుతున్నప్పటికీ బిసి జాబితాలో మేరు, చిప్పోలు పదాలు పొందు పరిచి ఉండటం వల్ల తమకు కుల ధృవీకరణ ప్రతాల జారీలో ఇబ్బందులుఎదురైతున్నాయని తెలంగాణ మేరు సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.బుధవారం ఎంబిసి కార్పొరేషన్ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్‌తో కలిసి బిసీ కమిషన్ సభ్యులకు కలిసి వినతి పత్రం అందజేసి అనంతరం మాట్లాడుతూ చిప్పోలు, మేరు కులానికి పర్యాయ పదంగా మేరు పదాన్ని బిసి జాబితాలో చేర్చాలని కోరారు. విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో తమ సామాజిక వర్గానికి కనీసం ప్రాతినిధ్యం లేదని ఈప్రతినిది బృందం దృష్టికి తెచ్చింది. తమను ఎంబిసి కులంగా గుర్తించాలని, తమ కార్పొరేషన్ పేరును టైలర్ ఫెడరేషన్ నుండి మేరు ఫెడరేషన్‌గా పేరును మార్పు చేయడానికి వీలుగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో కోవూరి భాస్కర్‌రావు, పోడిశేట్టి నర్సింగరావు, రావి పాపన్న, మురళీధర్, వడపల్లి మాధవ్, రామగిరి యాదగిరి, దీకొండ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

రొనిల్ సింగ్ 'నేషనల్ హీరో'

- భారత సంతతి పోలీసుపై ట్రంప్ ప్రశంసలు

వాషింగ్టన్, జనవరి 9: ఇటీవల అమెరికాలోని కాలిఫోర్నియాలో దుండగుల కాల్పులకు బలైన భారత సంతతి పోలీసు అధికారి రొనిల్ సింగ్(33)పై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. ఆయన అమెరికా 'నేషనల్ హీరో' అని పొగిడారు. ఓ అక్రమ వలసదారుడి చేతిలో విధులు నిర్విర్తిస్తున్న యువ అధికారి ప్రాణాలు కోల్పోయిన రోజున అమెరికా గుండె పగిలినంత బాధపడిందని ట్రంప్ వెల్లడించారు. న్యూమన్ పోలీస్ విభాగానికి చెందిన రోనిల్ సింగ్ డిసెంబరు 26న ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన విధులు నిర్వర్తిస్తుండగా అక్రమ వలదారుడు తుపాకీతో కాల్చి చంపేసి పారిపోయాడు. కాలిఫోర్నియా పోలీసులు తర్వాత నిందితుడిని అరెస్ట్ చేశారు. రొనిల్ మరణంపై ట్రంప్ సంతాపం వ్యక్తంచేశారు. మరణించిన అధికారి కుటుంబసభ్యులను, ఆయన తోటి ఉద్యోగులను ట్రంప్ ఇటీవల కలిసి మాట్లాడారు. వలసదారులు అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించడం వల్లే ఇలాంటి దారుణం జరిగిందని ట్రంప్ ఆరోపించారు. ఇక్కడ ఉండడానికి కూడా హక్కు లేని ఓ వ్యక్తి అమెరికా యువ అధికారి ప్రాణాలను తీశాడని ఆవేదన వ్యక్తంచేశారు. అక్రమంగా సరిహద్దులు దాటి వచ్చిన వారి వల్ల ఎంతో అమూల్యమైన మన పౌరుల ప్రాణాలు పోతున్నాయని అన్నారు. అమెరికాలో పలు చోట్ల ఇలాంటి అక్రమ వలసదారుల వల్ల ఎన్నో నేరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందుకే మెక్సికోతో సరిహద్దుల్లో భద్రత కల్పించేందుకు గోడ నిర్మించాలని తాను పట్టుబడుతున్నట్లు ట్రంప్ చెప్పుకొచ్చారు. డెమోక్రాట్లు గోడ నిర్మాణానికి నిధులు కేటాయించనీయకపోవడం వల్లే అమెరికా షట్‌డౌన్ ఇంకా కొనసాగుతోందని అన్నారు. అయితే గోడ నిర్మాణం జరిగితేనే

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలి

- రైల్వే ప్రాజెక్టును నిర్దేశిత టైంలోపు పూర్తిచేయాలి • రైల్వే బోర్డ్ ఛైర్మన్ శ్రీ వినోద్ కుమార్ యాదవ్



హైద్రాబాద్, జనవరి 9 (మనం ప్రతినిధి): భారతీ య రైల్వేలో పురోగతిలో ఉన్న మౌలిక సదుపాయా ప్రాజెక్టుకు సంబంధించిన పనుపై దృష్టి కేంద్రీకరించాని నిర్దేశిత క్ష్యంలోగా పూర్తిచే యాని శ్రీ వినోద్ కుమార్ యాదవ్, ఛైర్మన్, రైల్వే బోర్డ్, కొత్త ఢల్లీ సహా ఇచ్చారు. కొత్త ్నట మార్గా నిర్మాణం, గేజ్ మార్పిడులు, డబ్లింగ్‌కు సంబంధించిన పురోగతిపై ప్రధాన మంత్రి కార్యాయం, రైల్వే శాఖా మంత్రి శ్రీ పీయూష్ గోయల్ పర్యవేక్షిస్తారని తెలిపారు. జనవరి 09, 2019న ఆయన అన్ని జోన్ల జనరల్ మేనేజర్లు, ఆర్‌వీఎన్ఎల్ మరియు కోర్ సంస్థ అధికారుతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్త ఢిల్లీ నుంచి మాట్లాడారు. 2018 - 19 ఆర్థిక సంవత్సరంలో పూర్తి కావసిన రైల్వే ప్రాజెక్టు పురోగతిని శ్రీ వినోద్‌కుమార్ యాదవ్ సమీక్షించారు. డబ్లింగ్, ట్రిప్లింగ్, విద్యుదీకరణ, గేజ్ మార్పిడి, బైపాస్‌ల్కైన్లు మరియు యార్డు ఆధునీకరణ పను పూర్తి చేయడంపై దృష్టిసారించి మార్చి 2019లోగా పూర్తిచేయానిఅన్నారు. భూసేకరణ పనుతోసహా అన్నీ కీలక సమస్యను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషిచేయాన్నారు.ఈ సమావేశంలో దమరే అదనపు జనరల్ మేనేజర్ శ్రీ జాన్ థామస్ జోన్‌కు సంబంధించిన నివేదికను రైల్వే బోర్డు ఛైర్మన్‌కి సమర్పించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జోన్‌కి సంబంధించిన ఇతర ఉన్నత అధికాయి కూడా పాల్గొన్నారు

ఈ నెల 14న ఘనంగా బయోడైవర్సిటి ఫెస్టివల్



హైదరాబాద్, జనవరి 09, (మనం ప్రతినిధి): చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించేందుకు మెదక్ జిల్లాలో ఓ సదస్సును ఏర్పాటు చేసేందుకు ఓ గ్రామం ముందుకోచ్చింది. ఇక, నాణ్యమైన సాగు చేసేందుకు రైతులతో పాటు, వ్యవసాయ శాఖాదికారులు, మేదావులు, పలువురు ప్రొఫెసర్లతో జహిరాబాద్‌లో లచ్చునాయక్ తండా వాసులు శ్రీకారం చుట్టారు. ఇందులో బాగంగా ఈ నెల 14వ తేదీన లచ్చు నాయక్ తండాలో బయోడైవర్సిటి ఫెస్టివల్ (మొబైల్) ను నిర్వహిస్తున్నారు. ఈ ఫెస్టివల్‌కు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్‌ను స్థానిక మహిళలు కృష్ణావేణి, చంద్రమ్మ, అంజమ్మ, లక్ష్మమ్మ, అనుసుయమ్మలు కలిసి గురువారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా గురువారం తనను పౌర సరఫరాల భవన్‌లో కలిసి ఆహ్వానించిన మహిళలతో కమీషనర్‌తో సమావేశమయ్యారు. అయితే, వారు చేస్తున్న అవగాహనకార్యక్రమం మరింత ముందుకుపోవాలని, విజయం సాధించేందుకు ప్రభుత్వం తరపునా వారికి సహకరించనున్నట్లు..తెలిపిన ఆయన అ కార్యక్రమానికి కూడా హాజరవుతున్నట్లు చెప్పారు.

విశాఖ నుంచి విజయవాడకు

- జగన్‌పై హత్యాయత్నం కేసు బదిలీ

విజయవాడ, జనవరి 9: ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హత్యాయత్నం కేసును విశాఖపట్నం నుంచి విజయవాడకు బదిలీ చేయాలంటూ మెట్రోపాలిటన్ కోర్టు తీర్పునిచ్చింది. జగన్‌పై హత్యాయత్నం కేసులో ప్రభుత్వం తమకు సహకరించడం లేదని, ఈ కేసును విజయవాడకు బదిలీ చేయాలంటూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి.. ఈ కేసును విశాఖపట్నం నుంచి విజయవాడకు బదిలీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అంతేకాక కేసుకు సంబంధించిన అన్ని రికార్డులను ఎన్‌ఐఏకు అప్పగించాలంటూ కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.

అప్పులపై శ్వేతపత్రం విడుదల చెయ్యాలి

- ధనిక రాష్ట్రం అని చెబుతూనే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఎలా పెడతారు: నిజాముద్దీన్



హైదరాబాద్, జనవరి 09 (మనం ప్రతి నిధి)ః ధనిక రాష్ట్రం అంటూనే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఎలా ప్రవేశపెడతా రని టీపీసీసీ మైనారిటీ సెల్ నేత నిజా ముద్దీన్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అప్పులపై శ్వేతపత్రం విడు దల చెయ్యాలని డిమాండ్ చేశారు. బుధ వారం గాంధీభవన్‌లో విలేఖరుల సమావే శంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ బడ్జెట్ గురించి ఆలోచించకుండా రాజకీయాలపై చర్చలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమ ర్శించారు. రైతు బంధుకు రూ.15 వేల కోట్లు, రుణమాఫీకి రూ.24 వేల కోట్లు, ఉద్యోగుల జీతభత్యాలకు రూ.40 వేల కోట్లు కావాలని, ఇప్పటికే రూ.2,20,000 కోట్ల అప్పులతో ఉన్న ప్రభుత్వం ఈ మొత్తాలను ఎక్కడి నుంచి తెస్తుందని నిజాముద్దీన్ మండిపడ్డారు.

- బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం గడువు ఫిబ్రవరి 1 వరకు పొడిగించండి: జి నిరంజన్



బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం గడువును ఫిబ్ర వరి 1 వరకు పొడిగించాలని టీపీసీసీ డిమాండ్ చేసింది. పీసీసీ ఎన్నికల కమిటీ కన్వీనర్ జి నిరంజన్ బుధవారం గాంధీ భవన్‌లో విలేఖరులతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఓటరు నమోదుకు ఈ నెల 25 వరకు గడువు విధించినప్ప టికీ,పంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా జరుగుతున్న సంద ర్భంగా ఓటరు నమోదులో జాప్యం జరుగుతుందని, అందువల్ల ఓటరు నమోదు గడువు పెంచాలని కోరారు.

బీసీ సంఘాల రాస్తా రోకో

- ఈబీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ అర్ధ నగ్న ప్రదర్శన



హైదరాబాద్ ః కేంద్ర ప్రభుత్వం అగ్ర కులాలలో వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ నేడు జాతీయ బీసీ సంక్షేమ సంఘం హైదరాబాద్‌లో బషీర్ బాగ్ చౌరస్తాలో రాస్తా రోకో, అర్ధ నగ్న ప్రదర్శనలు జరిపారు. 71 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వాలు వెనుకబడ్డ వారికి ఏమీ చేయలేదు. కానీ, ఆగమేఘాల మీద ఒకే రోజు పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేశారని విమర్శించారు. అన్ని పార్టీలలో ఉన్న అగ్రకులాలు ఒక్కటై బీసీ కులాలను అణిచేస్తున్నారని అన్నారు.

రాష్ట్రంలో జరిగిన కుటుంబ సర్వేప్రకారం అగ్ర కులాలకు చెందిన వారు 9 శాతం ఉన్నారని తేలింది. కానీ, రిజర్వేషన్లు మాత్రం 10 శాతం పెడుతున్నారు. 52 శాతం ఉన్న బీసీలకు 25 శాతం రిజర్వేషన్లు పెట్టడం అన్యాయం కాదా? అంటూ వారు ప్రశ్నించారు. మోదీ తప్ప ప్రధాన మంత్రులు, రాష్ట్రపతులు, ముఖ్యమంత్రు లు, గవర్నర్లు, ఛైర్మన్ల పదవులు అగ్రకులాల వారే పొం దారు. ఆస్తులు, సంపద కూడా అగ్రకులాల ఆధీనంలో ఉన్నాయి. అధికారం చట్రంలో 80% ఉన్నత పదవులు అగ్రకులాల వారే పొందారు. 15 శాతం జనాబా ఉండి 80 శాతం పదవులు పొందుతున్న అగ్ర కులాల వారికి ఇంకా రిజర్వేషన్లు ఇవ్వడం ఏమిటని వారు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ ఆందోళనలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్, బీసీ సంక్షేమసంఘం రాష్ట్రప్రధానకార్యదర్శి దాసు సురేష్, వివిధ బీసీ సంఘాల నాయకులు జైపాల్ ముదిరాజ్, చందర్, లింగస్వామి, కల్వకుర్తి ఆంజనేయులు, తిరు మలగిరి అశోక్, హర్షవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
గురువారం, జనవరి 10

బాల్యాన్ని హరిస్తున్న ఆకలి


'నిద్ర సుఖమెరగదు, ఆకలి రుచి ఎరగదు' అన్నది పాతనానుడి. ఇప్పుడు 'ఆకలికి తేడా తెలియదు, ఏదైనా తినిపించేస్తుంది' అన్నది కొత్త నానుడిగా చెప్పుకోవచ్చు. మధ్యప్రదేశ్‌లో ఆలస్యంగా వెలుగుచూసిన విషాద ఘటన వింటే మన ప్రభుత్వాలు, సభ్యసమాజం తలదించుకోవలసిన పరిస్థితి. పేదల కోసం ఇంతచేశాం, అంతచేశామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాన్ని ఈ ఘటనైనా కళ్లు తెరిపిస్తుందా లేదా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని రత్లాం జిల్లాలో పదేళ్ల గిరిజన బాలుడు ఆకలికి తట్టుకోలేక ఎదురుగా కనిపించిన విషపూరిత పురుగుల మందు తాగేశాడు. గత నెల 31న ఈ ఘటన జరిగినప్పటికీ, ప్రపంచం నలుమూలలా సమాచార విప్లవాన్ని తీసుకొచ్చామని ఎంతో ప్రచారం చేసుకునే కాలంలో కూడా ఈ విషాద ఘటన వెలుగు చూడడానికి దాదాపు పదిరోజులు పట్టిందంటే మనమెంత చీకటి లోకంలో బతుకుతున్నామో తెలుస్తుంది.

నిరుపేదల్ని ఆకట్టుకునేందుకు, వారి ఆకలి తీర్చేందుకే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం ప్రవేశపెట్టామని గొప్పలు చెప్పుకునేందుకు పోటీపడే ప్రభుత్వాలు ఇప్పుడేం జవాబిస్తాయో చూడాల్సిందే! ఇటువంటి ఘటనలకు నువ్వు కారణమంటే నువ్వే కారణమని ఒకరిపై మరొకరు తోసేసి చాప కింద నీరులా జారుకుంటాయని మనకు ఇంతవరకు అనుసరిస్తున్న రాజకీయ పార్టీల వైఖరి చెబుతోంది. ఆకలిగొన్న వారికి అన్నం పెట్టడమే భారతీయ సంప్రదాయమని మన పెద్దలు చెప్పిన హితవు ఇప్పుడు పాలకులకు గుర్తుండవు. మన సంప్రదాయమంటూ నువ్వే బట్ట కట్టాలో చెబుతారు, నువ్వేం మతాన్ని విశ్వసించాలో శాసిస్తారు, కట్టుబొట్టులపై నిర్ణయాలు మనపై రుద్దేందుకు ప్రయత్నిస్తారు. కానీ, ఆకలి గొన్న వారికి అన్నం పెట్టాలన్న విషయం మాత్రం వారి మనసుకెక్కదు. ఆకలిని తట్టుకోలేక నిరుపేదలెంతమంది ప్రాణాలు కోల్పోతున్నారో తెలుసుకుని వారిని కాపాడేందుకు ఏ ప్రభుత్వమూ ముందుకు రాదు.

అయోధ్యలో రామాలయ నిర్మాణానికిచ్చే ప్రాధాన్యం పేదల ఆకలి కడుపులను పట్టించుకునేందుకు ఇవ్వరు. ఘటన జరిగినప్పుడు స్పందించే హక్కుల కమిషన్లు ఆ తరువాత దాన్ని గురించి ఆలోచించవు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని గుర్తుచేయవు. ఏదో సమాచారం అందింది కాబట్టి ఈ ఘటనపై దర్యాప్తునకు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) ఆదేశించింది కానీ, వెలుగులోకి రాని ఘటన గురించి గానీ, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన పద్ధతుల గురించిగానీ చర్చించవు. సూచనలు చేయవు. ఆవేదనలు చెందవు. కేవలం కంటితుడుపు చర్యగా మాత్రం వెలుగుచూసిన ఘటనలపై విచారణలు, దర్యాప్తుల పేరుతో కాలం గడిపేయడం సర్వసాధారణమైంది.

ఆకలి రహిత దేశాన్ని జాతిపిత మహాత్మా గాంధీ కోరుకున్నారు. అందులో భాగంగానే ఆహార భద్రత చట్టాన్ని రూపొందించుకున్నామని గొప్పలు చెప్పుకున్నాం. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న నోవాఖలిలో 1946లో గాంధీ మాట్లాడుతూ, మానవ జీవితంలో ఆహారానికున్న ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రతిఒక్కరికీ ఆహారం కల్పించాల్సిన బాధ్యతను దురదృష్టవశాత్తు స్వాతంత్ర్యానంతరం మన ప్రభుత్వాలు విస్మరించాయి. దేశం స్వేచ్ఛావాయువులు పీలుస్తూ 70 ఏళ్లు గడిచినా దేశంలో ఆకలి చావులు కొనసాగుతూనే ఉండడం విచారకరం. దేశంలో ప్రతిరోజూ 194.6 మిలియన్ల మంది ఆకలితో బాధపడుతున్నారని ఒక సర్వేలో తేలింది. ఐదేళ్ల లోపు పిల్లల్లో 24 శాతం ఆకలి బాధలకు తట్టుకోలేకే మరణిస్తున్నారని తెలుసుకుంటే మనసు విలవిల లాడుతుంది. దేశంలో రోజూ మూడువేల మంది ఆకలితో మరణిస్తున్నారు.

ఇటీవల దేశ రాజధాని న్యూఢిల్లీలో ఒక రిక్షావాలా పిల్లలు ముగ్గురు ఆకలికి తట్టుకోలేక మరణించారంటే బాలల హక్కులను మన ప్రభుత్వాలే మాత్రం పట్టించుకుంటున్నాయో స్పష్టమవుతుంది. ఆ ఘటన తరువాతైనా పటిష్ట చర్యలు చేపట్టడంలో ఆయా ప్రభుత్వాలు విఫలమైనాయని రుజువుగా ప్రస్తుతం మధ్యప్రదేశ్ ఘటన నిలుస్తుంది. ఎయిడ్స్, క్యాన్సర్ వ్యాధుల కంటే ఆకలి అనేది నేడు భయంకరమైనదిగా మారి పిల్లల ప్రాణాలను హరిస్తోందనడంలో సందేహం లేదు. ప్రపంచంలోని ఆకలితో బాధపడుతున్న మొత్తం జనాభాలో మూడోవంతు మనదేశంలోనే ఉన్నారని సమాచారం. ఒకప్పుడు సోమాలియా ఆకలి బాధలకు తార్కాణంగా నిలిచేది. ప్రపంచదేశాల స్పందనతో ప్రస్తుతం ఆ దేశ పరిస్థితి కొద్దికొద్దిగా మెరుగుపడుతోంది. ప్రపంచంలోనే ఆకలి నేడు అనేక ఆరోగ్య సమస్యలకు కారణమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా నిమిషానికి 12 మంది ఐదేళ్ల లోపు పిల్లలు ఆకలి కేకలకు బలవుతున్నారు. ఒకదేశంలో ఆహార కొరత ఏర్పడితే దాన్నే ఆకలిగా చెప్పుకోవచ్చునని ఆక్స్‌ఫర్డ్ ఆంగ్ల పదకోశం చెబుతోంది. ఈ నిర్వచనాన్ని బట్టి ప్రతి తొమ్మిది మంది బాలల్లో ఒకరు ఆకలితో బాధపడుతున్నారని చెప్పుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు, నగరాలకు వలసలు నిరోధించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో కుటీరపరిశ్రమలను ప్రోత్సహించాల్సిన అవసరమెంతైనా ఉన్నది. విద్య ప్రాధాన్యాన్ని ప్రజలు గుర్తించేలా చైతన్యం తీసుకురావాలి. మహిళలను స్వయం శక్తిసంపన్నులుగా తయారుచేసి వారు స్వావలంబన దిశగా తీసుకెళ్లేందుకు కృషిచేయాలి. వీటన్నిటికీ మించి ప్రతి ఒక్కరికి ఆహారాన్ని సమకూర్చే పథకాలు రూపొందించే బాధ్యతను ప్రభుత్వాలు చేపట్టాలి. ఇలా ఎంతచెప్పుకున్నా మన రాజకీయ నాయకులకు 'సొంత లాభం కొంతమానుకునే' లక్షణం అవసరం. ప్రతి అంశాన్ని ఎన్నికల కోణంలోనో, రాజకీయ ప్రయోజనం కోణంలోనో చూడడం మానుకుని వాస్తవాలకనుగుణంగా అడుగువేయడం రాజకీయ పార్టీల విధి కావాలి. ●



మంచిమాట



ఆత్మవిశ్వాసం
సడలితే ఓటమి
ప్రారంభమైనట్లే.

- స్వామి వివేకానంద

బీజేపీ యూటర్న్!

> రానున్న ఎన్నికల్లో మోదీ మరోసారి అధికారం చేజిక్కించుకోవాలంటే ఇంద్రజాలికుడిలా మారాల్సిందేనని ఇటీవలే ఓ విదేశీ పత్రిక సంపాదకుడు పేర్కొన్నారు కూడా. వాస్తవాలను పక్కనపెట్టి, మంత్రజాలం చేస్తేనే మళ్లీ మోదీ గద్దెనెక్కే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. మోదీ సర్కార్ ఈబీసీ రిజర్వేషన్ల అంశాన్ని చూస్తుంటే.. అది వాస్తవమే అనిపిస్తోంది.



మైనారిటీలకు, వెనకబడిన తరగతుల కోటా (రిజర్వేషన్) విధానాన్ని వ్యతిరేకించే బీజేపీ హఠాత్తుగా రిజర్వేషన్ల అంశంలో యుటర్న్ తీసుకుందా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. రిజర్వేషన్ల విధానం వల్ల దేశంలో మేధోపరమైన శూన్యత ఏర్పడుతుందని, పోటీతత్వం తిరోగమనంలోకి వెళ్లుందని వాదించే బీజేపీ వంటి మతతత్వ పార్టీ అకస్మాత్తుగా ఎన్నికల్లో విజయం కోసం ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించేందుకుద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్‌కు సమర్పించింది. అంతాబాగానే ఉన్నప్పటికీ, ఈ బిల్లుపై బీజేపీకి ఉన్న చిత్తశుద్ధే ప్రశ్నార్థకంగా తయారైంది. గతంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును దశాబ్దాల కాలం నుంచి కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టిన రాజకీయ పార్టీలకు హఠాత్తుగా ఈబీసీలకు రిజర్వేషన్ల అంశం గుర్తుకురావడం విస్మయం కలిగిస్తోంది. దాదాపు ముసాయిదా సిద్ధమై దానిపై రాజ్యసభ ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లు దుమ్ము దులిపి రంగంలోకి తీసుకొస్తే బీజేపీపై ప్రజల్లో సడలుతున్న విశ్వాసం కొంతమేరకు మెరుగుపడేది. కానీ, గతంలో అనేక సందర్భాల్లో ఈబీసీ రిజర్వేషన్లపై డిమాండ్లు ఉన్నప్పటికీ అప్పుడు ఉలకని అనేక రాజకీయ పార్టీలు సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అనూహ్యంగా ప్రేమ చూపడం వెయ్యి డాలర్ల ప్రశ్నగా మిగిలింది. అంతేగానీ దాదాపు ఐదేళ్లపాటు మిన్నకుండి ఇ ప్పుడు ఎన్నికలు వస్తున్న సమయంలో ఈబీసీలను తలకెత్తుకోవడం చూస్తుంటే ఇది కచ్చితంగా రాజకీయ ప్రయోజనాలనుద్దేశించిందే కానీ, ఈబీసీలపై ప్రేమ పొంగిపొర్లి తీసుకున్న నిర్ణయం కాదని స్పష్టమవుతోంది.

నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఈ పార్లమెంట్ సమావేశాలే చివరి కాబట్టి ఎలాగోలా ఆర్థికంగా వెనకబడిన అగ్రకులాలను ఆకర్షించేందుకు ఇంతకు మించి మంచి అవకాశం ఉండకపోవచ్చునని భావించి వుండవచ్చు. కానీ, ఇందుకు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించేందుకు పార్లమెంట్‌కు తగిన సమయం ఉండకపోవచ్చుననేది ఈ బిల్లు వెనకవున్న రాజకీయ ప్రయోజనాలను స్పష్టం చేస్తున్నాయి. రాజ్యాంగ సవరణలపై స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో అనేక చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో రాజ్యాంగ నిర్మాతగా మనం గౌరవిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వంటి అగ్రనేతలు పాల్గొన్నారు. ఆ సమయంలోనే వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల అంశంపై కూడా చర్చ జరిగింది. ఫలితంగా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు అనేవి రాజ్యాంగపరంగా ఉనికిలోకి వచ్చాయి.

అనంతరం మండల్ కమిషన్ నివేదక వచ్చిన తరువాత ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశాన్ని పరిశీలించింది. అప్పుడే ఆర్థికంగా వెనుకబడిన అంశం ప్రస్తావనకు వచ్చింది. కొన్నేళ్ల క్రితం సీనియర్ న్యాయవాది ఫాలి నారిమన్ క్రీమిలేయర్ అంశాన్ని తెరపైకి తెచ్చారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల్లో కొన్ని వర్గాలు ఆర్థికంగా ఉన్నతంగా ఉండొచ్చని, అలాంటి వారికి కూడా రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగపరంగా సరికాదని నారిమన్ అభిప్రాయపడ్డారు. నారిమన్ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు బెంచ్‌లోని ఐదుగురు సభ్యుల్లో నలుగురు న్యాయమూర్తులు అంగీకరించారు. వెనుకబడిన వర్గాలకు చెందిన జస్టిస్ పాండియన్ మాత్రం వ్యతిరేకించారు. ప్రస్తుతం తలపెట్టిన ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం గతంలో సుప్రీంకోర్టు అభిప్రాయానికి వ్యతిరేకమని, రాజ్యాంగపరంగా సరికాదని స్పష్టమవుతోంది. కానీ, ఈ అంశంలో రాజ్యాంగ సవరణ చేయడానికి ఇదే తగిన అదనుగా మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం భావిస్తోంది.

ఇంత హడావుడిగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలోని ఔచిత్యాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. సరైన కసరత్తు లేకుండా, న్యాయపరమైన చిక్కుల గురించి యోచించకుండా, ఎవరితోనూ చర్చించకుండా, పార్లమెంట్‌లో చర్చకు తగిన సమయాన్ని కేటాయించే అవకాశం లేని నేపథ్యంలో ప్రభుత్వం ఎందుకింత తొందరపాటుగా వ్యవహరిస్తోందని విపక్షం అభ్యంతరం చెబుతోంది. కానీ, ఇక్కడ ఒక్క విషయం గమనంలోకి తీసుకోవాలి. ఇప్పుడు తీసుకొస్తున్న రాజ్యాంగ సవరణ ప్రకారం ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తారు. ఇది ఇక్కడితో ఆగుతుందా అంటే చెప్పలేమనే జవాబు వస్తోంది. రేపు ఇది 20 శాతానికి పెరగవచ్చు. ఇంత తక్కువ వ్యవధిలో, తక్కువ సాక్ష్యాలతో ఉన్న ఇలాంటి అతి ముఖ్యమైన అంశంపై నిర్ణయం రాజ్యాంగపరంగా, న్యాయపరంగా నిలుస్తుందా అన్నది ఆలోచించాల్సిన అంశం. అందువల్ల ఈ రాజకీయ వ్యూహంపై తప్పనిసరిగా న్యాయనిపుణులు, రాజ్యాంగ నిపుణుల అభిప్రాయాల మేరకు నిర్ణయం తీసుకోవలసిన అవసరమెంతైనా ఉన్నది.



ఎలాగైనా తిరిగి అధికారంలోకి రావాలన్నది ఏ పాలకపక్షమైనా ఆశించడంలో తప్పులేదు. అందుకు తగిన వ్యూహాలను, అస్త్రశస్త్రాలను తయారుచేసుకోవడమూ తప్పుకాదు. కానీ, అందుకు తీసుకుంటున్న చర్యలు సమాజానికి, ప్రజలకు కీడు కలిగించని విధంగా ఉండాలి. కేవలం స్వప్రయోజనాలను, రాజకీయ కోణంలోనూ తీసుకునే నిర్ణయాల వల్ల భవిష్యత్తులో కలిగే నష్టాలను యోచించకుండా తొందరపాటు నిర్ణయాలు ఏ విధంగానూ హర్షణీయం కాదు.

ఇప్పటికే గత నెలలో జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గతంలో మాదిరిగా మోదీ ప్రభంజనం కనిపించలేదు. పైగా మూడు రాష్ట్రాల్లో బీజేపీ అధికారాన్ని కోల్పోయి ప్రతిష్ఠను మసకబార్చుకున్నది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రజలను మతపరంగాను, వర్గ పరంగాను ఆకర్షించడం ద్వారా అధికారాన్ని నిలుపుకోవాలనే ప్రయత్నాలు భాగంగా ప్రజల మనోభావాలను రెచ్చగొట్టేందుకు కూడా పాలకపక్షం వెనుకాడడం లేదు. అయోధ్యలో ఎట్టిపరిస్థితుల్లోను రామమందిర నిర్మాణం జరిగితీరుతుందని బీజేపీ నాయకులు రోజుకో హెచ్చరిక, పూటకో బెదిరింపుతో ప్రజలను భయభ్రాంతుల్ని చేసేందుకు వెనకాడడం లేదు. అలాగే ఇప్పుడు కొత్తగా కేరళలోని శబరిమల దేవాలయం వారికి అందివచ్చిన అవకాశంగా మారింది. ఒకపక్క సుప్రీంకోర్టు తీర్పుననుసరించి తెచ్చిన ట్రిపుల్ తలాఖ్ బిల్లును ఎందుకు వ్యతిరేకిస్తున్నారంటూ ప్రతిపక్షాలను ప్రశ్నిస్తున్న కేంద్రం మాత్రం అదే సుప్రీంకోర్టు తీర్పును శబరిమల అంశంలో ఎందుకు పట్టించుకోవడం లేదో అంతుబట్టని చిక్కు ప్రశ్న. ఇలా పాలకపార్టీ ద్వంద్వ వైఖరితో వ్యవహరించడంలో దాగున్న మతలబు ఏమిటనే అనుమానాలు, సంశయాలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.

ఎన్నికలు సమీపిస్తున్నందువల్ల ప్రజల మనసులను గెలుచుకునేందుకు దగ్గరి దారుల్లో పాలకపక్షం పయనించడం సరైన విధానం కాదు. పరిస్థితులను గమనిస్తే మరిన్ని తాయిలాలతో రైతులను, విద్యార్థులను, నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు మరింత దగ్గరి దారులను అనుసరించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తాత్కాలిక ఉపశమన చర్యలు గాకుండా శాశ్వత పరిష్కారం చూపించే చర్యలపై దృష్టి పెట్టడం నిజమైన దేశభక్తుల కార్యాచరణగా నిలుస్తుంది. తమను వ్యతిరేకించేవారందరినీ దేశద్రోహులుగా, జాతి ద్రోహులుగా చిత్రీకరించే ధోరణి నుంచి బయటపడి సమాజంలో నిజంగా క్లేశాలు అనుభవిస్తున్న రైతులు, నిరుద్యోగులు, రైతు కూలీలపై దృష్టికేంద్రీకరించి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపేవారెవరినైనా ప్రజలు తలకెత్తుకుంటారు. అంతేగానీ, పిడుక్కీ బియ్యానికీ ఒకే మంత్రం ఎప్పటికీ పనికిరాదు. ఏదో తాత్కాలిక ప్రయోజనాన్ని కల్పించినా శాశ్వతంగా దేశం నష్టపోతుందనే విషయాన్ని పాలకపక్షం ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది. రానున్న ఎన్నికల్లో మోదీ మరోసారి అధికారం చేజిక్కించుకోవాలంటే ఇంద్రజాలికుడిలా మారాల్సిందేనని ఇటీవలే ఓ విదేశీ పత్రిక సంపాదకుడు పేర్కొన్నారు కూడా. వాస్తవాలను పక్కనపెట్టి, మంత్రజాలం చేస్తేనే మళ్లీ మోదీ గద్దెనెక్కే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. మోదీ సర్కార్ ఈబీసీ రిజర్వేషన్ల అంశాన్ని చూస్తుంటే.. అది వాస్తవమే అనిపిస్తోంది. ఎన్నికల దగ్గర పడుతున్న వేళ నరేంద్ర మోదీ తన అంబులపొది నుంచి ఒక్కో బాణాన్ని ఎక్కుపెట్టి...ప్రజలకు ఎర వేస్తున్నట్లు కనిపిస్తోంది. మరి వచ్చే ప్రజలు వాస్తవాలు గ్రహిస్తారో లేక, ఎన్డీయే సర్కార్‌కే పట్టం కడతారా అనేది తేలాలంటే మరికొద్ది నెలలు వేచి చూడాల్సిందే.

◆ పార్వతి
9490793437

నాకు నవ్వాలని ఉంది

అపుడే వికసించిన సిరిమల్లె పూవులా
స్వచ్ఛంగా నవ్వాలని ఉంది!
అమ్మ కొంగుతో దోబూచులాడుతున్న
పసిపాపలా కిలకిలా నవ్వాలని ఉంది!
ఆకుపచ్చ చీర కట్టుకున్న వరిపైరులా
ఆనందంగా నవ్వాలని ఉంది!
లేత మామిడి మధురిమను
తృప్తిగా ఆస్వాదిస్తున్న చిలకమ్మలా
మధురంగా నవ్వాలని ఉంది!

పున్నమి నాటి చంద్రుడిలా
పసిడికాంతిగా నవ్వాలని ఉంది!
ఆకాశంలోని హరివిల్లులా
రంగుల కలపోతలా నవ్వాలని ఉంది!
పల్లెపడుచు నండూరి ఎంకిలా
అమాయకంగా నవ్వాలని ఉంది!
అందమైన బాపు గీసిన బొమ్మలా
ముగ్ధ మనోహరంగా నవ్వాలని ఉంది!
రవివర్మ చేతిలో ఒంపు ఒంపుకు
వయ్యారాలు పోతున్న కుంచెలా
గర్వంగా నవ్వాలని ఉంది!

వేణుగానం విన్న రాధలా
తన్మయత్వంగా నవ్వాలని ఉంది!
గలగలా పారుతున్న గోదారిలా
జలజల జారుతున్న సెలయేరులా
మిలమిల మెరుస్తున్న ముత్యాల సరంలా
నవ్వాలని ఉంది!

మధుమాసంలోని ప్రకృతి దరహాసంలా...
తొలకరి చినుకులతో తనువు తడుపుకుంటూ...
అభ్యంగన స్నానంచేస్తూ పులకించిపోతున్న
నేలతల్లిలా నవ్వాలని ఉంది!

అవును.. నాకు నవ్వాలని ఉంది!
మనసారా.. గుండె నిండుగా..హాయిగా...
రాగద్వేషాలకు అతీతంగా...
ఈ యాంత్రిక జీవితానికి దూరంగా...
నిస్వార్థమైన కల్మషం లేని
నా వాళ్ళు ఎవరైనా ఉంటే...
వాళ్ళతో కలిసి 'నాకు నవ్వాలని ఉంది'!!

- గుడిపల్లి విద్యావతి
అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్
8886614346



అతిశయం ఎందుకో?

తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ మొదలుకుని నేటి ప్రధాని మోదీ వరకు దేశాన్ని ఎందరెందరో ప్రధానులు పాలించారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో ప్రజాస్వామిక విలువలు పాదు కొల్పడానికి నెహ్రూ చేసిన కృషి మరువలేనిది. ప్రశ్నించే బల మైన ప్రతిపక్షాలు లేకున్నా, అవధులు లేని అధికారం అనుభ వించే అవకాశం ఉన్నా ఆయన ఏనాడు నియంతగా వ్యవహ రించలేదు. అప్పుడప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలు కాస్త ఉత్సా హాన్ని ప్రదర్శించినా ఆయన తగురీతిలో నియంత్రించేవా రు. ఈ మధ్య తనను విమర్శిస్తూ కార్టూన్‌లు వెయ్యడం తగ్గించడం ఏమీ బాగోలేదని, మీరు వేసే కార్టూన్స్ నేను చేసే తప్పుల్ని ఎత్తిచూపడం వల్ల వాటిని సరిచేసుకునే అవ కాశం ఉంటుందని ఆయన ప్రఖ్యాత కార్టూనిస్ట్ ఆర్.కె. లక్ష్మ ణ్‌కు రాసిన లేఖ జగత్ప్రసిద్ధం.

ఆయన తరువాత ప్రధాని బాధ్యతలు చేపట్టిన లాల్ బహదూర్ శాస్త్రి సైతం దేశంలో ప్రజాస్వామిక విలువలు బలోపేతం కావడానికి ఇతోధికంగా కృషిచేశారు. ఇక ఆయన మరణం తరువాత ప్రధాని బాధ్యతలు చేపట్టిన శ్రీమతి ఇందిరాగాంధీ ఆదిలో అమాయకంగా కనబడినా రానురాను బలపడి వ్యవస్థలన్నిటిని తన గుప్పిట్లో పెట్టుకున్న విధానాన్ని సైతం ఈ దేశం చవిచూసింది. ఆమె నియంతృత్వ పోకడల వల్లే దేశంలో మొట్టమొదటి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడింది. ప్రజాస్వామ్య విలువలకు పాతరేసి ఆమె దేశం నెత్తి మీద రుద్దిన ఎమెర్జెన్సీని నేటికీ ప్రజలు మర్చిపోలేదు. కాంగ్రెసేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల పట్ల కూడా ఇందిర కక్షసాధింపుతోనే వ్యవహరించేవారు. ఇందిర తరువాత అంతటి నియంతృత్వ పోకడలు కల్గిన ప్రధానిగా నేడు మోదీ పేరు తెచ్చుకుంటున్నారు. ఇందిర, మోదీల మధ్య ఉన్న మరో సారూప్యత ఏమిటంటే ఇద్దరు నేతలు ప్రజాబాహుళ్యంలో అంతులేని అభిమానం కలవారే. అంతేకాదు ఇరువురు నేతలకు సమకాలీనంగా సరైన ప్రత్యర్థులుగా నిలబడగల్గిన ప్రజానేతలు ప్రతిపక్షాల్లో లేకపోవడం కూడా విచిత్రం. ఇది కూడా వారిలో నియంతృత్వ పోకడలు పెంపొందడానికి కారణం అనిపిస్తుంది.

నిజానికి గడచిన ఏడూ శతాబ్దాలలోనూ ఏ ప్రధానిపైనా పెట్టుకోనన్ని ఆశలు ఈ ప్రజలు మోదీపై పెట్టుకున్నారు. దాన్ని ఆయన బాధ్యతాయుతంగా భావించి ఉంటే వర్తమానం మరోలా ఉండేది. సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా మోదీ సరికొత్త విధానాల్ని దేశం యవనికపై ఆవిష్కరిస్తారని యువత అభిప్రాయపడ్డారు. మేకిన్ ఇండియా వంటి పథకాలతో తొలుత మోదీ అటువంటి ప్రయత్నాలు చేసినా రానురాను ఆయన దేశ అభివృద్ధి లక్ష్యాలపై నుంచి కేవలం రాజకీయ లక్ష్యాలపైకే దృష్టిని మళ్ళించడంతో అవన్నీ మూలనపడ్డాయి.

రాజకీయంగా ప్రత్యర్థులను వేధించే ప్రక్రియ గత ప్రభుత్వాల హయాంలోనూ సాగినా మోదీ పాలనలో అది పరాకాష్ఠకు చేరింది. తమకు రాజకీయ ప్రత్యర్థులు అనేవారే ఉండకూడదనేది మోదీ, అమిత్ షాల లక్ష్యంగా ఉంది. ఈ క్రమంలో తమిళనాడు, జమ్మూకశ్మీర్‌లో వారివురు అనుసరించిన విధానాలు ప్రజాస్వామ్యానికే తలవంపులుగా మిగిలాయి. ఇక నేడు ఆంధ్రప్రదేశ్ పట్ల కూడా వారు అదే విధానాన్ని అనుసరిస్తున్నారు. నిజానికి రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరన్న నానుడికి ప్రత్యక్ష నిదర్శనం తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీలు. వారివురూ అవసరమైనప్పుడు మిత్రత్వం నెరపటం, అవసరం తీరాక శత్రుత్వం వహించటం అనేది గత ముప్పై ఏండ్లుగా జరుగుతున్నదే. గత నాలుగేళ్ళు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఆ రెండు పార్టీలు నేడు కత్తులు దూసుకోవటం విచిత్రమేమి కాదు.

బీజేపీతో కలిస్తే కేంద్రం నుంచి గణనీయంగా నిధులు రాబట్టి, విభజన హామీలను అమలుపరుచుకుని మరలా అధికారంలోకి రావచ్చుననే ఉద్దేశంతోనే గత సార్వత్రిక ఎన్నికలకు ముందు తెలుగుదేశం ఆ పార్టీతో జతకట్టింది. కానీ కేంద్రంలో పూర్తి మెజారిటీతో కమలదళం అధికారంలోకి రావటంతో సైకిల్ ఆశలకు గండిపడింది. రైతు రుణమాఫీ మొదలుకుని పోలవరం, రాజధాని నిర్మాణం, ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, రైల్వేజోన్ ఇలా ప్రతి అంశంలోనూ కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించకపోగా కొర్రీలు వెయ్యడం విశేషం. నిజానికి ఆయా అంశాల్లో కేంద్రం రాష్ట్రానికి మేలుచేసి ఉంటే కమలదళం ఆంధ్రలో గణనీయంగా బలపడేదే. కానీ రాష్ట్రంలో నెలకొని ఉన్న కులరాజకీయాలు అందుకు సహకరించలేదు. తమ పార్టీ బలపడకపోయినా పరవాలేదు. ముందుముందు వచ్చే తమ కులానికి చెందిన నాయకునికి మేలు జరగాలంటే



రాష్ట్రంలో సమస్యలు పరిష్కారం కాకుండా ఉంటేనే మంచిది అనేది ఆంధ్ర బీజేపీలో కొందరి నాయకుల అభిమతం. వారు వేసిన ఎత్తులే కేంద్ర పెద్దలు రాష్ట్రంపై శీతకన్ను వేసేలా చేశాయన్నది బహిరంగ రహస్యం. ఈ క్రమంలో భాగంగా గతవారంలో ఆ పార్టీ కార్యకర్తలతో ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొన్న ప్రధాని వారితో సంభాషిస్తూ ఆంధ్రలో ప్రజలు మార్పు కోరుతున్నారని వ్యాఖ్యానించారు. ఆ మార్పు ఏ వైపు అన్నది మాత్రం ఆయన చెప్పలేదు. పైగా ఆ పార్టీ నాయకుడు సాక్షాత్తు ముఖ్యమంత్రిని పట్టుకుని హీనంగా దూషిస్తుంటే ప్రధాని ముసిముసి నవ్వులు నవ్వుకోవడం ఆశ్చర్యకరం. తెలంగాణలో మహాకూటమిని ఓడించడం ద్వారా అక్కడి ప్రజలు తమనేదో గెలిపించినట్లు కమనాథులు ఆనందపడటం చూస్తుంటే తమ కన్ను ఒకటి పోయినా పర్లేదు... అన్న సామెతను వారంతా అనుసరిస్తున్నారని అర్థమవుతోంది. దీనివల్ల వారికొచ్చే ప్రయోజనమేమిటో పైవాడికే ఎరుక. ఎందుకంటే కేంద్రంలో అధికారంలో ఉన్నారు కనుకనే ఆంధ్రలో ప్రతిపక్షాలు కానీ, తెలంగాణలోని అధికారపక్షం కానీ భారతీయ జనతా పార్టీతో స్నేహం చేస్తున్నట్లు కనిపిస్తున్నాయి కానీ ఆ అధికారమే కనుక కోల్పోతే వారందరి దృష్టిలో మునుపటి రీతిలోనే బీజేపీ ఒక అంటరాని పార్టీయే అన్నది జగమెరిగిన సత్యం. అంతెందుకు వెనుక ఎంతటి మిత్రత్వం ప్రదర్శిస్తున్నా ఆంధ్రలో ప్రతిపక్షాలు నేరుగా బీజేపీతో కలిసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితే లేదంటేనే ఆంధ్రలో ఆ పార్టీ పరిస్థితి ఏమిటో అర్థమవుతోంది. ఆ మాత్రం దానికి ఆ పార్టీకి అంత అతిశయం ఎందుకో అర్థం కాదు. ఇక దేశంలో అలుముకుంటున్న తాజా రాజకీయ పరిణామాలు చూస్తుంటే ఆంధ్ర సంగతి ఏమో కానీ దేశప్రజలు మాత్రం మార్పు కోరుకుంటున్నారన్న సంగతి విస్పష్టమవుతుంది. ప్రత్యర్థి పార్టీల మాటెలా ఉన్నా ముందు కమనాథులు తమ సంగతి చూసుకోవడం మేలు.

◆ గొడవర్తి శ్రీనివాసు
9963556696

ఇందులో ప్రచురించిన వ్యాసాలు, కథనాలు ఆయా రచయితల అభిప్రాయాలే, వీటితో సంపాదకవర్గానికి గానీ, యాజమాన్యానికి గానీ ఎలాంటి సంబంధం లేదు. - సంపాదకులు

పాక్‌కు చైనా 'సీఎం-302' మిసైల్స్

- భారత ఉపఖండంలో మారనున్న బలాబలాలు
- బ్రహ్మోస్ శక్తిసామర్థ్యాలున్న 'సీఎం-302'
- అత్యాధునిక రాడార్‌ను రూపొందించిన డ్రాగన్
- మన దేశ పరిమాణం సైజులో నౌకా దళానికి..

న్యూఢిల్లీ, జనవరి 9: భారత ఉపఖండంలో సైనిక సామర్థ్యాలను తారుమారు చేయగల శక్తి ఉన్న అత్యంత శక్తివంతమైన యాంటీ షిప్ మిసైల్‌ను పాకిస్థాన్‌కు అందించాలని చైనా నిర్ణయించింది. దాదాపు మన దేశ నౌకదళానికి చెందిన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణికి ఉన్న శక్తిసామర్థ్యాలు వీటికి ఉండటం గమనార్హం. 'సీఎం-302' మిస్సైల్స్‌ను పాక్‌కు చైనా అందించనుంది. ఈ మిస్సైళ్లను చైనా తయారీ 054 ఫ్రిగేట్ యుద్ధ నౌకల్లో అమర్చనున్నారు. దాంతో సముద్ర జలాల్లో పాక్ మరింత బలోపేతం కానుందని రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు. కాగా, అత్యంత శక్తిమంతమైన రాడార్‌ను చైనా అభివృద్ధి చేసింది. ఈ అత్యాధునిక కాంపాక్ట్ సైజ్ మారిటైమ్ రాడార్ భారత దేశం పరిమాణంలో ఉన్న ప్రదేశంపై నిలకడగా నిఘా పెట్టగలదు. నావికా దళం కోసం రూపొందించిన ఈ రాడార్ వ్యవస్థను దేశీయంగానే అభివృద్ధి చేశారు. చైనా సముద్రాలపై కచ్చితమైన నిఘా పర్యవేక్షణకు ఇది ఉపయోగపడుతుంది. శత్రు నౌకలు, విమానాలు, క్షిపణుల వల్ల కలగబోయే ప్రమాదాన్ని చాలా ముందుగానే పసిగట్టడానికి ఈ రాడార్ వ్యవస్థ దోహదపడుతుంది. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం కన్నా చాలా శక్తిమంతమైన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశారు. చైనా నిర్వహిస్తున్న ఓవర్ ద హోరైజన్ (ఓటీహెచ్) రాడార్ ప్రోగ్రామ్‌తో అనుబంధం ఉన్న శాస్త్రవేత్తను ఉటంకిస్తూ హాంగ్‌కాంగ్‌కు చెందిన సౌత్ చైనా మోర్నింగ్ పోస్ట్ ఈ వివరాలను వెల్లడించింది.











నష్టం జరగదు.. నాది హామీ

- మీ హక్కులకు భంగం వాటిల్లదు
- ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ప్రధాని హామీ



షోలాపూర్, జనవరి 9: పౌరసత్వ బిల్లును ఆమోదించడం వల్ల అసోంతోపాటు ఈశాన్య రాష్ట్రాలకు ఎటువంటి నష్టం జరగబోదని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. అక్కడి వారి హక్కులకు ఎలాంటి నష్టం వాటిల్లదని హామీ ఇచ్చారు. జాతీయ పౌరసత్వ బిల్లుపై కొన్ని పార్టీలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని, వాటిని నమ్మకూడదని చెప్పారు. బుధవారం మహారాష్ట్రలోని షోలాపూర్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభలో ప్రధాని మాట్లాడారు. షోలాపూర్-ఉస్మానాబాద్ 4 లేనింగ్ రోడ్డును మోదీ ప్రారంభించారు. దీనికి 2014లో ఆయన శంకుస్థాపన చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన క్రింద 30 వేల గృహాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ ఇళ్ళు చెత్త ఏరుకునే వారు, రిక్షా కార్మికులు, బీడీ కార్మికులు వంటి సొంత ఇళ్ళు లేనివారి కోసం నిర్మిస్తారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. జాతీయ పౌరసత్వ బిల్లుపై ఎలాంటి ఆందోళన చెందొద్దని అసోం, ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు సూచించారు. పౌరసత్వ చట్ట సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించన నేపథ్యంలో అసోంతోపాటు పలు ఈశాన్య రాష్ట్రాల్లో హింస చెలరేగుతోంది. ఈశాన్య రాష్ట్రాల్లో చేపట్టిన బంద్‌తో జనజీవనం స్తంభించింది. ఈ బంద్‌కు ఏజీపీ, కాంగ్రెస్, ఏఐయూడీఎఫ్, కేఎంఎస్ఎస్ మద్దతు తెలిపాయి. బంద్ ప్రభావం అసోంలో తీవ్రంగా కనిపించింది. ఏఏఎస్‌యూ కార్యకర్తలు, ఆందోళనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. జాతీయ హైవేలను దిగ్బంధించారు. చాలా ప్రాంతాల్లో వాహనాల అద్దాలను ధ్వంసం చేశారు. రైలు పట్టాలపై బైఠాయించారు. దిబ్రూగఢ్‌లో సీఎం సర్బానంద సోనోవాల్ ఇంటి వద్ద ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేశారు. సీఎంను ఘెరావ్ చేశారు. దాదాపు 100 సంస్థలు బంద్‌కు మద్దతివ్వడంతో ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మైఖేల్ మామ వల్లే ఒప్పందం ఆగిందా?

కాపలాదారు చీకట్లో అయినా సరే తప్పు చేసేవారిని పట్టుకోగలడని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంలో కుంభకోణం జరిగినట్లు ఆరోపిస్తున్న కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. అవినీతిని తుద ముట్టించే కార్యక్రమం చేపట్టిన కాపలాదారును ఎవరూ కొనలేరని, బెదిరించలేరని హెచ్చరించారు. అటువంటి ప్రయత్నాలు ఎన్ని జరిగినప్పటికీ కాపలాదారు తన పనిని అవిశ్రాంతంగా నిర్వహిస్తారని చెప్పారు. అగస్టా వెస్ట్‌లాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కొనుగోలు ఒప్పందం కేసులో ఇటీవల అరెస్టయిన క్రిస్టియన్ మైఖేల్ రఫేల్ కంపెనీ ప్రత్యర్థి కంపెనీ అయిన యూరోఫైటర్ కంపెనీ తరపున లాబీయింగ్ చేశారన్నారు. ''ఆ మైఖేల్ మామ వల్లే రఫేల్ ఒప్పందం కుదరలేదా?'' అని రాహుల్‌ను ఉద్దేశించి మోదీ ప్రశ్నించారు.

పత్రికల్లో వార్తలను ప్రస్తావిస్తూ మైఖేల్ మరికొన్ని ఇతర పోటీ కంపెనీలకు లాబీయింగ్ చేశారన్నారు. కాంగ్రెస్ దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మైఖేల్‌తో ఏ నేతకు సంబంధాలు ఉన్నాయో కాంగ్రెస్ వెల్లడించాలన్నారు. క్రిస్టియన్ మిషెల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇటీవల ప్రశ్నించింది. 'శ్రీమతి గాంధీ', 'ఇటలీ మహిళ తనయుడు' అనిమైఖేల్ చెప్పారని కోర్టుకు ఈడీ తెలిపింది.


ఎన్‌డీఏలో కొనసాగడంపై ఆలోచిస్తాం

- మేఘాలయ సీఎం కన్రాడ్ సంగ్మా హెచ్చరిక

షిల్లాంగ్, జనవరి 9: సార్వత్రిక ఎన్నికల ముందు ఎన్డీయే కూటమి నుంచి మరో పార్టీ బయటకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పౌరసత్వ సవరణ బిల్లు-2018కి లోకసభలో ఆమోదం తెలపడంతో అసోం గణ పరిషత్ (ఏజీపీ) ఎన్డీయేతో తెగదెంపులు చేసుకుంటున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఇప్పుడు మేఘాలయకు చెందిన నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) కూడా ఎన్డీయేను వీడాలని యోచిస్తున్నట్లు సమాచారం. పౌరసత్వ బిల్లును మేఘాలయ సీఎం కన్రాడ్ సంగ్మా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బీజేపీతో ఉన్న పొత్తును తెగదెంపులు చేసుకోవాలనే విషయంతో పార్టీ నేతలతో చర్చించనున్నట్లు తెలిపారు. ఎన్డీయేతోనే కొనసాగాలా? వద్దా? అనే దానిపై పార్టీ నేతలతో విస్తృతంగా చర్చలు జరిపిన అనంతరం దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, మిజోరం సీఎం జొరాంతంగా కూడా బిల్లు ఆమోదంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎన్‌డీఏ మిత్రపక్షమైన ఎంఎన్ఎఫ్ అధ్యక్షుడైన ఆయన ఎన్‌డీఏలో కొనసాగడంపై పునరాలోచిస్తామన్నారు. పార్లమెంట్ ఆమోదించిన పౌరసత్వ బిల్లు లౌకికవాదానికి పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు.

బ్యాక్‌ఫుట్‌పై మోదీ

- రైతులు, యువత సిక్సర్లు కొట్టాలి
- అన్నదాత సత్తా ఏమిటో మోదీకి తెలిసింది
- జైపూర్ సభలో ప్రధానికి రాహుల్ చురకలు



జైపూర్, జనవరి 9: ప్రధాని నరేంద్రమోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. ఈసారి వినూత్నంగా క్రికెట్ పరిభాషలో చురకలు అంటించారు. జైపూర్‌లో జరిగిన బహిరంగసభలో రాహుల్ మాట్లాడుతూ ''ప్రధాని నరేంద్ర మోదీ బ్యాక్‌ఫుట్‌లో ఆడుతున్నారు. రైతులు, యువత ముందుకొచ్చి సిక్సర్లు బాదాలి'' అని పిలుపునిచ్చారు. మూడు రాష్ట్రాల ఎన్నికలతో ప్రధానికి రైతుల సత్తా ఏమిటో తెలిసి వచ్చిందని అన్నారు. ఒత్తిడిలో ఉన్న వ్యవసాయ రంగంలో సమస్యల పరిష్కారానికి రైతు రుణాల రద్దు చాలా చిన్న ముందడుగు అని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కారమవ్వాలంటే నూతన హరిత విప్లవం రావాల్సి ఉందన్నారు.



రైతులకు వ్యవసాయ క్షేత్రం వద్దే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి వారి టమోటాలు, బంగాళాదుంపలను ఎగుమతి చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. భారత రైతులు ప్రపంచమంతటికీ ఆహారం సరఫరా చేస్తారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తాము కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయగానే దేశవ్యాప్తంగా రైతు రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ రుణాల మాఫీ రైతులకు ఉపశమనం కలిగిస్తుందని, అయితే ఇది ఒక్కటే తుది పరిష్కారం కాదన్నారు. రఫేల్ ఒప్పందంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీచే విచారణ జరిపించాలని ఆయన పునరుద్ఘాటించారు. రఫేల్‌పై పార్లమెంట్‌లో చర్చ జరిగితే ప్రధాని పత్తాలేరని, రెండున్నర గంటలు మాట్లాడిన రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తాము అడిగిన ఏ ప్రశ్నకూ బదులివ్వలేదని ఆరోపించారు.

'మహాకూటమి'లో చేరం..

- కాంగ్రెస్, బీజేపీకి సమాన దూరం
- స్పష్టంచేసిన సీఎం నవీన్ పట్నాయక్

న్యూఢిల్లీ, జనవరి 9: సంకీర్ణ కూటమిలో తాము చేరేది లేదంటూ ఒడిసా సీఎం నవీన్ పట్నాయక్ స్పష్టంచేశారు. 'మహాకూటమి'లో చేరేది లేనిదీ చెప్పేందుకు ఒకరోజు గడువు కావాలంటూ మంగళవారం మీడియాకు వెల్లడించిన పట్నాయక్.. ఆమరుసటి రోజే తన నిర్ణయాన్ని ప్రకటించడం విశేషం. '' బిజూ జనతాదళ్ మహాకూటమిలో భాగస్వామి కాదు'' అంటూ ఆయన పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌కు సమాన దూరంలో తాము ఉండనున్నట్టు పట్నాయక్ వివరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల సమయానికల్లా ఓ కూటమిగా ఏర్పడేందుకు పలు పార్టీలు జోరుగా ప్రయత్నాలు చేస్తున్న సమయంలో బీజేడీ ఎవరివైపు మొగ్గుచూపుతుందంటూ అందరూ ఆసక్తిగా వేచి చూశారు. రాష్ట్రపతి ఎన్నికల సమయంలో ఎన్డీయేకు మద్దతుగా నిలిచిన బీజేడీ, ఉపరాష్ట్రపతి ఎన్నికలు వచ్చేసరికి ప్రతిపక్షానికి మద్దతిచ్చింది. అయితే ఈ ఎన్నికల్లో వెంకయ్యనాయుడుకి వచ్చిన ఓట్లను గమనించిన ఒడిసా కాంగ్రెస్ బీజేడీలో క్రాస్ ఓటింగ్ జరిగిందని భావించిందికూడా. ప్రధాని మోదీ స్వయంగా పట్నాయక్‌కు ఫోన్ చేసిన అనంతరం రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నికల్లో మళ్లీ ఎన్డీయేకు బీజేడీ మద్దతిచ్చి అందరినీ ఆశ్చర్యపరచింది. కీలకమైన 8 బీజేడీ ఓట్లే ఈ ఎన్నికల్లో గెలుపోటములు నిర్దేశించాయి.

బెంగాల్‌లో బీజేపీ దూకుడు


- కాషాయజెండా కప్పకొన్న తృణమూల్ ఎంపీ
- తూర్పులో పెరిగే మోదీ బలం: ధర్మేంద్రప్రధాన్



కోల్‌కతా, జనవరి 9: పశ్చిమబెంగాల్‌లో బీజేపీ దూకుడు ప్రదర్శించడం మొదలైంది. డిసెంబరులో రథయాత్రలతో ఇది ప్రారంభించినా.. తాజాగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక ఎంపీని తమ గూటికి లాక్కుంది. లోక్‌సభ సభ్యుడు సౌమిత్ర ఖాన్ (38) న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ బలం రోజురోజుకూ విస్తరిస్తోందని, 2019 ఎన్నికల్లో మోదీ బలం తూర్పులో మరింత పెరుగుతుందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి, బీజేపీ నాయకుడు ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించారు. ఈ దిశగా ఇదో చిన్న ముందడుగన్నారు. నరేంద్రమోదీ చెబుతున్న 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్'కు తాను పూర్తి మద్దతు పలుకుతున్నానని, తృణమూల్ కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం లేదని.. అందుకే దాన్ని వదిలిపెట్టి బీజేపీలో చేరుతున్నానని సౌమిత్ర ఖాన్ విలేకరులతో అన్నారు. కాగా, సౌమిత్రఖాన్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తృణమూల్ ఆ తర్వాత ప్రకటించింది. ఇదే విషయాన్ని పార్లమెంటుకు కూడా తెలియజేయాలని ఎంపీ సుదీప్ బందోపాధ్యాయకు పార్టీ సెక్రటరీ జనరల్ పార్థ చటర్జీ సూచించారు. పశ్చిమబెంగాల్‌లోని బంకురా జిల్లా బిష్ణుపూర్ నియోజకవర్గం నుంచి సౌమిత్ర ఎంపీగా ఎన్నికయ్యారు. అంతకుముందు ఆయన అదే జిల్లానుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉండేవారు. 2017 నవంబరులో బీజేపీలో చేరిన తృణమూల్ రాజ్యసభ ఎంపీ ముకుల్ రాయ్‌కి ఖాన్ నమ్మకస్తుడైన అనుచరుడు. ఖాన్ పార్టీలో చేరే సమయంలో ముకుల్‌రాయ్ కూడా అక్కడే ఉన్నారు. తర్వాత పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షాతో కొద్దిసేపు ఖాన్ భేటీ అయ్యారు. 2019 ఎన్నికల్లో బెంగాల్‌లోని 42 లోక్‌సభ స్థానాల్లో కనీసం 22 సాధించాలని బెంగాల్ బీజేపీకి అమిత్ షా లక్ష్యంగా చెప్పారు. తృణమూల్ ఎంపీ, మమతాబెనర్జీ సమీప బంధువైన అభిషేక్ బెనర్జీతో సంబంధాలు చెడిపోవడం వల్లే ఖాన్ బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈసారి ఎన్నికల్లో తనకు టికెట్ దక్కకపోవచ్చని కూడా ఆయనకు అనుమానం ఉంది.

కుటుంబంతో.. కులాసాగా!

- సీబీఐ విచారణతో బాధేమీ లేదు
- వారివన్నీ తప్పుడు ఆరోపణలే
- మా కూటమి లెక్కలు కావాలేమో
- నాడు కాంగ్రెస్‌పార్టీ.. నేడు బీజేపీ
- యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్



న్యూఢిల్లీ, జనవరి 9: తన మీద సీబీఐ విచారణ జరుగుతున్నా.. తనకేమీ బాధ లేదని, కుటుంబంతో కులాసాగా గడుపుతున్నానని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఒక ట్వీట్‌లో చెప్పారు. అక్రమ మైనింగ్‌కు సంబంధించి అఖిలేశ్‌పై దాదాపు 20 కేసులను సీబీఐ విచారిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఆయన మాత్రం తన భార్య డింపుల్ యాదవ్, ఇద్దరు కుమార్తెలు, కుమారుడితో కలిసి తన ఆఫీసు గదిలో కులాసాగా కూర్చుని టీవీ చూస్తూ కబుర్లు చెప్పుకొంటున్నట్లున్న ఫొటోను ట్వీట్ చేశారు. దాంతో పాటు ఒక హిందీ కవితను కూడా అక్కడ పోస్ట్ చేశారు. ''నేను వార్తల్లోకి ఎందుకు వచ్చానో ప్రపంచానికి తెలుసు, వార్తల పునాదే చెడ్డదైనప్పుడు దాని గురించి బాధ ఎందుకు'' అని దాని అర్థం. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గనుల శాఖను తనవద్దే ఉంచుకున్న అఖిలేశ్‌ను ప్రశ్నించేందుకు సీబీఐ సిద్ధంగా ఉందని తెలుస్తోంది. అక్రమ మైనింగ్ కేసులో అఖిలేశ్ హస్తం ఉందనే విషయాన్ని రుజువుచేసే పత్రాలు తమ వద్ద ఉన్నాయని.. మొత్తం 22 మైనింగ్ లీజులు ప్రశ్నార్థకంగా ఉంటే వాటిలో 14 ఫైళ్లను అఖిలేశే ఆమోదించారని, మిగిలినవాటిని ఆయన మంత్రి గాయత్రీ ప్రసాద్ ఆమోదించారని సీబీఐ వర్గాలు అంటున్నాయి. యూపీ సర్కారు మంజూరుచేసిన లీజులను అలహాబాద్ హైకోర్టు రద్దుచేసిన 18 రోజుల తర్వాత.. వాళ్లకే మళ్లీ కాంట్రాక్టులు వచ్చాయని.. దానికి ఆయన సమాధానం చెప్పి తీరాలని కేసులను విచారిస్తున్న ఒక అధికారి అన్నారు. అయితే తనపై సీబీఐ విచారణ పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని అఖిలేశ్ వాదిస్తున్నారు. ఇప్పుడు సీబీఐ అధికారులకు తాము ఎస్పీ-బీఎస్పీ కూటమిలో ఎవరికెన్ని సీట్లిచ్చామో చెప్పాలని.. ఎట్టకేలకు బీజేపీ తన అసలు రంగు చూపించిందని ఆయన విమర్శించారు. ఇంతకుముందు కాంగ్రెస్ పార్టీ తమకు సీబీఐని కలిసే అవకాశం కల్పిస్తే, ఇప్పుడు బీజేపీ ఆ పని చేసిందని ఎద్దేవా చేశారు. రాజ్యసభలో ప్రతిపక్షాలు అఖిలేశ్ మీద సీబీఐ విచారణపై సోమవారం గందరగోళం సృష్టించాయి.

అలోక్‌నాథ్‌పై తప్పుడు కేసు!

- వింతా నందా పెట్టిన కేసుపై ముంబై కోర్టు
- స్వప్రయోజనాల కోసం పెట్టారని వ్యాఖ్య

ముంబై, జనవరి 9: సీనియర్ నటుడు అలోక్‌నాథ్‌పై రచయిత్రి - దర్శకురాలు వింతా నందా పెట్టింది తప్పుడు కేసేనా? అది కేవలం ఆమె స్వప్రయోజనాల కోసమే రేప్ కేసు పెట్టారా? ముంబైలోని దిన్‌దోషి సెషన్స్ కోర్టు వ్యాఖ్యలు చూస్తే అలాగే అనిపిస్తోంది. ఈ కేసులో అలోక్‌నాథ్ (62)కు ముందస్తు బెయిల్ మంజూరైన విషయం తెలిసిందే. ఫిర్యాదుదారుకు జరిగిన ఘటన మొత్తం గుర్తుంది గానీ, నెల, తేదీ మాత్రం గుర్తులేవని.. ఈ లెక్కన చూసుకుంటే అలోక్‌నాథ్‌ను తప్పుడు కేసులో ఇరికించడానికి ఉన్న అవకాశాలను కూడా కొట్టి పారేయలేమని జడ్జి ఎస్ఎస్ ఓఝా అన్నారు. ఎఫ్ఐఆర్ అనేది ఏ కేసులోనైనా చాలా కీలకం, ముఖ్యమని.. ఎఫ్ఐఆర్‌ను తక్షణం దాఖలుచేయడం అనేది ఫిర్యాదుదారు చెప్పే విషయంలో వాస్తవాలకు గీటురాయిలా నిలుస్తుందని ఆయన అన్నారు. ఎఫ్ఐఆర్ దాఖలులో ఆలస్యం ఉందంటే, అప్పటికప్పుడు జరిగే అంశాలు లేకపోవడం, చెప్పే విషయాల రంగు మారిపోవడం, ఉన్నదాన్ని అతిగా చేసి చూపించడం, ఎక్కువ మందిని సంప్రదించి వాళ్లేం చెబితే అదే చేయడం లాంటివి కూడా ఉంటాయని జడ్జి చెప్పారు. ముంబై పోలీసులు 2018 నవంబరు 21వ తేదీన అలోక్‌నాథ్‌పై అత్యాచారం కేసు నమోదుచేశారు. సుమారు 20 ఏళ్ల క్రితం ఈ ఘటన జరిగిందని వింతానందా ఫిర్యాదుచేశారు. 1998లో ఈ ఘటన జరిగినప్పుడు అలోక్‌నాథ్ తనకంటే చాలా శక్తిమంతుడిగా ఉండేవారని, అందువల్ల కేసు పెట్టొద్దని పలువురు సలహా ఇచ్చారని ఆమె తెలిపారు. ఆమెకు కనీసం నెల, తేదీ కూడా గుర్తులేవంటే ఇది తప్పుడు కేసులాగే కనిపిస్తోందని జడ్జి ఓఝా అన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని అలోక్‌నాథ్ ఆమెను ఏమీ బెదిరించలేదని కూడా ఆయన అన్నారు. అందువల్ల, తన సొంత ప్రయోజనం కోసమే ఘటన జరిగిన వెంటనే బాధితురాలు ఫిర్యాదు చేయలేదని తెలుస్తోందన్నారు. వీరిద్దరూ కలిసి తార అనే టీవీ సీరియల్‌లో నటించారు. ఆ సమయంలో అలోక్‌నాథ్ షూటింగులకు తాగి వచ్చేవారని ప్రాసిక్యూషన్ తన ఆరోపణలలో పేర్కొంది. ఒక సందర్భంలో అలోక్‌నాథ్.. సీరియల్‌లో ప్రధాన పాత్రధారిణి అయిన వింతానందాపై అత్యాచారం చేశారన్నారు. వింతా నందాను ఆ సీరియల్ నుంచి తీసేసిన తర్వాత తన ఇంటికి రావాలని అలోక్‌నాథ్ వేధించేవారని, ఒకసారి పార్టీ నుంచి తన ఇంటికి తీసుకెళ్లి అక్కడ అత్యాచారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పార్శిల్స్ కలకలం

- ఆస్ట్రేలియాలో భారత ఎంబసీ ఎదుట పార్శిల్స్
- అధికారులను ఖాళీ చేయించిన భద్రతా బలగాలు
- మరో 11 రాయబార కార్యాలయాలు కూడా ఖాళీ

మెల్‌బోర్న్, జనవరి 9: ఆస్ట్రేలియాలో అనుమానాస్పద పార్సిల్స్ కలకలం సృష్టించాయి. మెల్‌బోర్న్, కాన్‌బెర్రాలలోని దౌత్య, కాన్సులేట్ కార్యాలయాలకు అనుమానాస్పద పార్సిల్స్ వచ్చాయని అక్కడి ఫెడరల్ పోలీసులు వెల్లడించారు. భారత దౌత్య కార్యాలయానికి కూడా ఈ పార్సిల్స్ వచ్చాయి.పార్సిల్స్ అంశాన్ని పరిశీలిస్తున్నామని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. అత్యవసర సేవల విభాగం అధికారులు పార్సిల్స్‌ను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. తమ కార్యాలయానికి పార్సిల్ వచ్చినట్లు మెల్‌బోర్న్‌లోని బ్రిటిష్ హైకమిషన్ అధికార ప్రతినిధి వెల్లడించారు. తమ సిబ్బంది క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.మెల్‌బోర్న్‌లోని దాదాపు 9 దౌత్య కార్యాలయాలకు ఈ పార్సిల్స్ వచ్చినట్లు ఆస్ట్రేలియా మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇందులో అమెరికా, బ్రిటన్, జర్మనీ, స్విట్జర్లాండ్, భారత రాయబార కార్యాలయాలు ఉన్నాయని చెప్తున్నాయి. అగ్నిమాపక, వైద్య సిబ్బంది మెల్‌బోర్న్‌లోని భారత, అమెరికా దౌత్య కార్యాలయాల వద్ద మోహరించిన ఫొటోలను అక్కడి మీడియా ఒకటి ప్రసారం చేసింది.

పిటిషనర్లకు గుజరాత్ ఎన్‌కౌంటర్‌ల నివేదిక

- సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 9: గుజరాత్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లపై తుది నివేదికను పిటీషనర్లకు ఇవ్వాల్సిందిగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. గుజరాత్ రాష్ట్రంలో 2002 నుంచి 2006 మధ్యకాలంలో జరిగిన 24 ఎన్‌కౌంటర్లు నకిలీవంటూ ఇద్దరు ప్రముఖులు సుప్రీంకోర్టులో న్యాయపోరాటానికి ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలుచేశారు. అయితే ఎన్‌కౌంటర్లపై జస్టిస్ హెచ్ఎస్ బేడీ కమిటీ ఇచ్చిన నివేదికను పిటీషనర్లు అయిన బీజీ వర్గీస్, జావేద్ అఖ్తర్‌లకు ఇవ్వాలని ఆదేశించింది. ఇందుకు గుజరాత్ సర్కారు వ్యక్తంచేసిన అభ్యంతరాలను ధర్మాసనం తోసిపుచ్చింది. కాగా బేడీ నివేదికను ఆమోదించాలా, తిరస్కరించాలా అన్నది ఆతరువాతి విషయమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ పేర్కొన్నారు.

కన్నుమూసిన వర్గీస్

ప్రముఖ జర్నలిస్ట్ అయిన వర్గీస్ 2014, డిసెంబరు 30న కన్నుమూశారు. అయితే ఆయన దాఖలుచేసిన పిల్ మాత్రం 2007లో విచారణకు వచ్చింది. ఎన్‌కౌంటర్లపై స్వతంత్ర సంస్థలైన సీబీఐ వంటి ఏజెన్సీల ద్వారా నిష్పాక్షికంగా విచారణ జరిపితే నిజం బయటికి వస్తుందంటూ అఖ్తర్, వర్గీస్ పిల్‌లో పేర్కొన్నారు. రిపోర్టుపై తమ స్పందనను ధర్మాసనానికి నివేదించేందుకు పిటీషనర్లకు నాలుగు వారాల గడువును ధర్మాసనం ఇచ్చింది. మైనారిటీ వర్గానికి చెందిన వారిని టెర్రరిస్టులుగా చిత్రీకరిస్తూ నకిలీ ఎన్‌కౌంటర్లకు పాల్పడ్డారంటూ ప్రముఖ బాలీవుడ్ గీత రచయిత అయిన జావేద్ అఖ్తర్ దాఖలు చేసిన పిల్‌లో పేర్కొన్నారు.

రెండోరోజూ కొనసాగిన బంద్

- గోవా, కేరళలలో ఉద్రిక్తత.. బెంగాల్‌లో హింస
- ముగిసిన రెండు రోజుల దేశవ్యాప్త సమ్మె

పణజి/ తిరువనంతపురం, జనవరి 9: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలు చేపట్టిన భారత్ బంద్ రెండో రోజు బుధవారం కొనసాగింది. కొనసాగుతోంది. కార్మిక సంఘాల నాయకుల చేపట్టిన బంద్ బెంగాల్‌లో కొంత హింసాత్మకంగా మారింది. బెంగాల్‌లో రోడ్డుపైకి వచ్చిన వాహనాలపై ఆందోళన కారులు రాళ్లు రువ్వడంతో వాహనాల అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ త్రీవంగా గాయపడ్డాడు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపున్న సీపీఎం నేత సుజన్ చౌదరీను పోలీసులు అరెస్ట్ చేయడంతో అక్కడ కొంతఘర్షణ వాతావరణం నెలకొంది. దేశ వ్యాప్తంగా వామపక్షాలు, కార్మిక సంఘాలు బంద్‌లో పాల్గొన్నాయి. మహారాష్ట్ర వ్యాప్తంగా 32వేల మంది కార్మికులు బంద్‌ను పాటిస్తున్నారు. కార్మికుల హక్కులకై వారు డిమాండ్ చేస్తున్నారు. కేరళలో కూడా రెండో రోజు బంద్ కొనసాగుతోంది. తిరువనంతపురంలో రైలు పట్టాలపై కార్మికులు బైఠాయించడంతో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. అన్ని రాష్ట్రాల్లోనూ కార్మికులు తెల్లవారుజాము నుంచే రోడ్లమీదకు వచ్చి నిరసనలు తెలిపారు. దాంతో అనేక ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. కర్ణాటకలో ఆర్టీసీ బస్సులు పెద్ద సంఖ్యలో నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. ప్రజా రవాణాలో కీలకంగా ఉండే ప్రైవేటు బస్సులు కూడా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు. కేంద్ర ప్రభుత్వం ముందు కార్మిక సంఘాలు 12 డిమాండ్‌లను ఉంచిన విషయం తెలిసిందే. రెండు రోజుల బంద్‌కు పది ట్రేడ్ యూనియన్లు మద్దుతు ప్రకటించాయి.

మనం మూవీ
manammovie
గురువారం 10 జనవరి 2019 హైదరాబాద్ 6

ప్రతిరోజూ జీవితాన్ని ఆస్వాదిస్తా

- వెంకటేష్



వెంకటేష్, వరుణ్‌తేజ్ నటించిన చిత్రం 'ఎఫ్ 2... ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్' శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమా తెరకెక్కింది. జనవరి 12న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా గురించి వెంకటేష్ బుధవారం మధ్యాహ్నం విలేకరులతో మాట్లాడారు.

- 'ఎఫ్2' పక్కా ఫ్యామిలీ సినిమా. గత నాలుగైదేళ్లుగా సినిమాలు బావుంటే ఫ్యామిలీలు థియేటర్లకు రావడాన్ని చూస్తూనే ఉన్నాం. ఈ సినిమాలో నాకు తెలియకుండానే, ఎన్నో ఇంప్రూవైజ్‌లు మేనరిజమ్స్ పరంగా జరిగిపోయాయి. సినిమాలో, పాత్రలో లీనమైనప్పుడే అలాంటివన్నీ జరుగుతాయి.
- డైరెక్టర అనీల్ చాలా మంచి కుర్రాడు. స్వయంగా రైటర్ కావడంతో ఎక్కడైనా, ఏదైనా పంచ్ కావాలనిపించినా వెంటనే పక్కకెళ్లి రాసుకునేవాడు. నా గత చిత్రాలన్నిటినీ స్టడీ చేసినట్టు అనిపించింది.
- వరుణ్ చాలా తక్కువ కాలంలోనే కలిసిపోయాడు. ఇమేజ్ చట్రంలో ఇరుక్కోకుండా తనదైన శైలితో ముందుకు సాగుతున్నాడు. తెలంగాణ యాసలో మాట్లాడాడు. పర్సనాలిటీ కూడా చాలా బావుంటుంది. బాగా చేశాడు. తనకీ, మెహ్రీన్‌కి మధ్య సన్నివేశాలు కూడా బావుంటాయి.
- ఎప్పుడూ ఫలానా అని కోరుకోను. అయినా నాలోని నటనను పూర్తి స్థాయిలో చూపించదగ్గ పాత్రల కోసం వెయిట్ చేస్తున్నా. నాకు ఏం ఇవ్వాలో ప్రకృతికి తెలుసు. నాకు కావలిసినన్ని పాత్రలు వస్తూనే ఉంటాయి. వాటిలో నుంచి నాకు నచ్చినవి నేను సెలక్ట్ చేసుకోవడమే. నాకూ అమీర్‌ఖాన్ చేసే సినిమాలు, అమితాబ్ తరహా వైవిధ్యమైన చిత్రాలు చేయాలని ఉంటుంది. అంతెందుకు బాహుబలి లాంటి సినిమాలు చేయాలని కూడా ఉంటుంది.
- ప్రతిరోజూ జీవితాన్ని ఆస్వాదిస్తా. క్రమశిక్షణతో ఉంటా. అంతకు మించి మరేమీ లేదు. బాహ్య ప్రపంచం గురించి పెద్దగా పట్టించుకోను. సూర్యోదయాన్ని చూస్తా. పక్షులను గమనిస్తా. పక్కవాళ్లు బావుండాలని కోరుకుంటా.
- 'వెంకీ మామ' ఉంది. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఒకటి ఉంటుంది. అనిల్ మరలా ఇంకో స్క్రిప్ట్ ఏదో రెడీ చేస్తున్నాడు. ఏది ముందవుతుందో చూడాలి. వెంకీ మామలో చాలా మంచి రోల్ చేస్తున్నా. నా రోల్ ఎంత బావుంటుందో, చైతూ పాత్ర కూడా అంతే బావుంటుంది.
- 'గురు' తర్వాత చేస్తున్న సినిమా ఇది. ఆ తర్వాత చాలా స్క్రిప్టులు విన్నాను. కానీ కుదరలేదు. ఈ స్క్రిప్ట్ నచ్చింది. నా కైండ్ స్టోరీ ఉంటూనే కొత్తగా ఉంది. యువకుడితో కలిసి పనిచేయడంలో ఒకరకమైన ఆనందం ఉంటుంది. వారి నుంచి మనం నేర్చుకోవచ్చు. మన నుంచి వారు తెలుసుకుంటారు. అందులోనూ ఇందులో నేనూ, వరుణ్ తోడల్లుళ్లుగా నటించాం. బిఫోర్ మేరేజ్, ఆఫ్టర్ మేరేజ్ వంటివన్నీ ఫన్నీగా ఉంటాయి.
- పెళ్లి గురించి, భార్యల గురించి ఎంత సరదాగా మాట్లాడుకున్నా, ఆడవాళ్లు లేనిదే సృష్టిలేదు. ఆడవాళ్ల గొప్పదనాన్ని మనం గుర్తించాలి.

ప్రధాన మంత్రిగా..


● మోహన్‌లాల్

'రంగం' ఫేమ్ కె.వి.ఆనంద్ దర్శకత్వంలో తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న 37వ చిత్రం 'కాప్పాన్'. ఇటీవల ఈ చిత్రం రెండు షెడ్యూల్స్‌ను పూర్తి చేసుకుంది. ఈ చిత్రంలో మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రధాన మంత్రి పాత్రలో నటిస్తున్నారని సమాచారం. ఆయనకు సెక్యూరిటీ కమాండర్‌గా సూర్య కనిపించనున్నాడట. బోమన్ ఇరానీ, ఆర్య, చిరాగ్ జానీ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. హారిస్ జైరాజ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో సూర్య సరసన 'అఖిల్' ఫేమ్ సయేషా సైగల్ కథానాయికగా నటిస్తుంది. ప్రస్తుతం సూర్య ఈ సినిమా షూటింగ్‌కి బ్రేక్ ఇచ్చి సెల్వ రాఘవన్ తెరకెక్కిస్తున్న 'ఎన్‌జికె' చివరి షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 14న విడుదలకానుంది.

మళ్లీ బిగ్‌బాస్‌లోకి..!


● ఎన్టీఆర్

హిందీ నుండి తెలుగులోకి వచ్చిన రియాలిటీ షో బిగ్‌బాస్. ఇందులో తొలి సీజన్‌ను ఎన్టీర్ హోస్ట్ చేయగా రెండో సీజన్‌ను నాని హోస్ట్ చేశారు. అయితే ఇప్పుడు నిర్వాహకులు మూడో సీజన్‌ను హోస్ట్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారట. మూడో సీజన్‌కు ఎన్టీఆర్‌నే హోస్ట్‌గా తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ ప్రస్తుతం రాజమౌళి సినిమా 'ఆర్ ఆర్ ఆర్ ' సినిమా చేస్తున్నారు. మరి దర్శకుడు రాజమౌళి బిగ్ బాస్ హోస్ట్ చేయడానికి అనుమతి ఇస్తాడా? లేదా అనేది తెలియాలి. సీజన్ 3 హోస్ట్‌గా వెంకటేష్ పేరు కూడా ఇటీవల ప్రముఖంగా వినపడింది.

ముందుగా మలయాళంలో...


● నిత్యామీనన్

నిత్యామీనన్ 'ప్రాణ' అనే ప్రయోగాత్మక చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే. వి.కె.ప్రకాష్ దర్శకత్వంలో తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం తెరకెక్కింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా మలయాళ వెర్షన్‌ను జనవరి 18న విడుదల చేస్తుంటే.. తెలుగు, కన్నడ, హిందీ వెర్షన్స్‌లో ఫిబ్రవరి 8న విడుదల చేస్తున్నారట. హిల్ స్టేషన్ నేపథ్యంలో సాగే ఈ థ్రిల్లర్ మూవీలో రచయిత్రిగా కనిపించనున్నారు నిత్య. ఒకే ఒక పాత్రతో సాగే ఈ ప్రయోగాత్మక చిత్రానికి.. ఆస్కార్ అవార్డు గ్రహీత రసూల్ పూకుట్టి సౌండ్ డిజైనర్‌గా వ్యవహరించారు. 'గాడ్ ఫాదర్ ఆఫ్ ఇండియన్ జాజ్' లూయిస్ బ్యాంక్స్ సంగీతం అందిస్తున్నారు. పి.సి.శ్రీరామ్ ఛాయాగ్రహణం అందించిన ఈ మూవీ కేవలం 23 రోజుల్లో చిత్రీకరణను పూర్తి చేసుకుంది.

భరతనాట్య 'ప్రణవం'

చరిత అండ్ గౌతమ్ ప్రొడక్షన్స్ పతాకంపై 'ఈరోజుల్లో' శ్రీ మంగం, శశాంక్, అవంతిక హరి నల్వా, గాయత్రి అయ్యర్ ప్రధాన పాత్రల్లో కుమార్ జి. దర్శకత్వంలో తను.ఎస్ నిర్మిస్తోన్న చిత్రం 'ప్రణవం'. ఈ చిత్రం షూటింగ్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుపుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు కుమార్ జి. చిత్ర విశేషాలు తెలియజేస్తూ...''ఇప్పటికే మా సినిమాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ మొత్తం పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చండీఘర్‌కు చెందిన మోడల్ అవంతిక హరి నల్వా హీరోయిన్‌గా నటిస్తుండగా, గాయత్రి అయ్యర్ మరో ముఖ్య భూమికలో నటిస్తోంది. భరతనాట్యం నేపథ్యంలో లవ్, సస్పెన్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. అన్నివర్గాల ప్రేక్షకులకు నచ్చే సినిమా అవుతుందన్న నమ్మకంతో ఉన్నాం. అలాగే మా సినిమాకు మ్యూజిక్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఆర్.పి.పట్నాయక్‌గారు, ఉష గారు కలిసి ఒక డ్యూయెట్ మా సినిమాలో ఆలపించారు. త్వరలో ఆడియో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఫ్రెష్ కాన్సెప్ట్‌తో యంగ్ టీమ్ అంతా కలిసి చేస్తోన్న మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాం'' అన్నారు.


● శ్రీ, అవంతిక

లవ్ అండ్ పొలిటికల్ చిత్రంగా 'బైలంపుడి'



తార క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ పారిశ్రామిక వేత్త బ్రహ్మానందరెడ్డి నిర్మిస్తోన్న చిత్రం 'బైలంపుడి'. హరీష్ వినయ్, తనిష్క తివారి జంటగా నటిస్తున్నారు. అనిల్ పిజి రాజ్ దర్శకుడు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం లిరికల్ సాంగ్‌ను బుధవారం హైదరాబాద్‌లోని ఫిలించాంబర్ లో బాలీవుడ్ హీరోయిన్ మైరా అమిథి చేతుల మీదుగా లాంచ్ చేశారు. అనంతరం మైరా అమిథి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలను తెలియజేశారు. నిర్మాత బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ''పారిశ్రామికవేత్తగా ఉన్న నేను సినిమా మీద ఆసక్తితో తొలిసారిగా నిర్మాతగా 'బైలంపుడి' చిత్రాన్ని నిర్మిస్తున్నా. అందరూ కొత్తవారైనప్పటికీ ఎంతో సహజసిద్ధంగా నటించారు. షూటింగ్ పూర్తైంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హై టెక్నికల్ వాల్యూస్ తో సినిమాని తెరకెక్కించాం. 'ఇక్కడ యుద్ధం చేయాలి...గెలవడానికి కాదు, బతకాడినికి' అనేది మా సినిమా క్యాప్షన్. 'పిల్లల దేవుడు..' అనే లిరికల్ సాంగ్ రిలీజ్ చేశాం. అందరికీ పాట నచ్చుతుందన్న నమ్మకం ఉంది'' అన్నారు. సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ మాట్లాడుతూ ''ఇందులో రెండు పాటలున్నాయి. ఈ రోజు పిల్లల దేవుడు అనే పాట లాంచ్ చేశాం. పాట అందరికీ నచ్చుతుంది'' అన్నారు. దర్శకుడు అనిల్ పిజి రాజ్ మాట్లాడుతూ ''కెమెరామేన్‌గా నా కెరీర్ స్టార్ట్ చేశాను. చాలా చిత్రాలకు వర్క్ చేశాను. దర్శకుడుగా ఇది తొలి సినిమా. 'బైలంపుడి' అనే గ్రామంలో జరిగే లవ్ అండ్ పొలిటికల్ చిత్రమిది. ప్రతి పాత్ర ఎంతో సహజ సిద్ధంగా ఉంటుంది. ఒక విలేజ్ లో ఏమైతే అంశాలు ఉంటాయో...మా సినిమాలో కూడా అన్ని అంశాలుంటాయి. నిర్మాత ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. ప్రస్తుతం కొత్త కథలను ఆదరిస్తున్నారు. ఆ తరహాలో వచ్చే మా సినిమాను కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నా'' అన్నారు.

ఏప్రిల్ 18న 'కాంచన3'


● రాఘవ లారెన్స్

'ముని, కాంచన, కాంచన 2' వంటి హారర్ చిత్రాలతో హీరోగా, దర్శకుడిగా విజయాన్ని సాధించారు రాఘవ లారెన్స్. ఇప్పుడు ముని ఫ్రాంచైజీ నుండి వస్తున్న మరో హారర్ కామెడీ చిత్రం 'కాంచన 3'. తమిళ, తెలుగు బాషల్లో ఈ చిత్రం షూటింగ్ దాదాపు పూర్తికావొస్తుంది. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. తెలుగులో లైట్ హౌస్ మూవీమేకర్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై బి.మధు సమర్పణలో రాఘవేంద్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాఘవ నిర్మాణంలో తెరకెక్కించారు. ఏప్రిల్ 18న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా బి.మధు మాట్లాడుతూ ''రాఘవ లారెన్స్ తెరకెక్కించిన హారర్ సినిమాలు అన్నీ సూపర్ హిట్లే. అందులో ముని సీక్వెల్స్ మరీ స్పెషల్. కాంచన పేరుతో స్టార్టయిన తరువాత ఇప్పుడు కాంచన-3గా ప్రేక్షకుల ముందుకు ఏప్రిల్ 18న రానుంది. ఈ సిరీస్‌లో ఇది నాలుగో చిత్రం. గత మూడు చిత్రాలని మించి కాంచన-3 వుండబోతుందని నమ్ముతున్నాం'' అన్నారు.

న్యాయం చేశాననే అనుకుంటున్నా

గత ఏడాది 'వీడెవడు' చిత్రంలో నటించిన ఈషాగుప్తా ఈ ఏడాది 'వినయ విధేయ రామ' చిత్రంతో పలకరించనుంది. ఈ సినిమాలో ఈషాగుప్తా స్పెషల్ సాంగ్‌లో నటించడం విశేషం. ఏక్ బార్ ఏక్ బార్.. అంటూ సాగే ఈ పాటలో నటించడం గురించి ఈషా గుప్తా మాట్లాడుతూ ''బేసిక్‌గా నేను డాన్స్ చేయడానికి ఇష్టపడతాను. కాబట్టి రాంచరణ్‌తో డ్యాన్స్ చేయడానికి ఇష్టపడ్డాను. కచ్చితంగా రేపు సాంగ్ చూస్తే నేను న్యాయం చేశాననే అనిపిస్తుంది. ఒకే సాంగ్‌లో కనిపించినా.. నాకు నచ్చే చేశాను. నేను చరణ్ డ్యాన్స్‌ను ఇష్టపడతాను. ఆయన ఇండస్ట్రీలో వన్ ఆఫ్ ది బెస్ట్ డ్యాన్సర్. 'మగధీర' చిత్రంలో చరణ్ నటనకు ఫిదా అయ్యాను. ఇండియన్ సినిమాకు బెస్ట్ సినిమాలను అందించిన దక్షిణాది సినిమాల్లో భాగం కావడానికి ఇష్టపడుతున్నాను'' అన్నారు.


● ఈషా గుప్తా

సుకుమార్ సినిమాలో మరోసారి!


● అనసూయ

మహేష్‌బాబు నటిస్తున్న 25వ సినిమా 'మహర్షి'. వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దిల్‌రాజు, అశ్వినీదత్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన లాంగ్ షెడ్యూల్ ఇటీవల పూర్తయింది. సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్‌లో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమా తర్వాత సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేయబోతున్నారు మహేష్. ప్రసుత్తం ఈ సినిమాకి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఈ సినిమాలో నటి, యాంకర్ అనసూయ ఒక ప్రత్యేక పాత్ర పోషించనుందని తెలుస్తోంది. రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ రూపొందించిన 'రంగస్థలం' చిత్రంలో అనసూయ.. రంగమ్మత్తగా అందర్నీ మెప్పించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మహేష్ సినిమాకి కూడా ఆ సెంటిమెంట్‌ని కొనసాగించా లని అనుకుంటున్నారట సుకుమార్. ఈ చిత్రాన్ని జూన్‌లో సెట్స్‌పైకి తీసుకెళ్ళే ప్రయత్నాలు చేస్తున్నారు.





వాట్సాప్‌లో కొత్త ఫీచర్

న్యూఢిల్లీ : ప్రముఖ మెసేజింగ్ అప్లికేషన్ వాట్సాప్‌లో మరో కొత్త ఫీచర్ రానుంది. వాట్సాప్‌లో మీరు చేసే మెసేజ్‌లు మరొకరు చూడకుండా ఆప్షన్ త్వరలో అందుబాటులోకి వచ్చేస్తోంది. వాట్సాప్‌లో తమ సంభాషణలు ఇతరులు చూడకుండా ఉండేలా ఆండ్రాయిడ్ వెర్షన్లో వాట్సాప్‌కు ఫింగర్ ప్రింట్ అథెంటికేషన్ ఆప్?న్ రాబోతుంది. దీంతో ఇకపై వాట్సాప్ యాప్‌ను ఓపెన్ చేయాలంటే తప్పనిసరిగా వేలిముద్ర అవసరమని వెబ్?ఈటల్ ఇన్ఫో అనే వెబ్‌సైట్ నివేదించింది.

ఈ ఫీచర్ అందుబాటులోకి వస్తే యూజర్లకు ఫేస్ ఐడీ, టచ్ ఐడీ ద్వారా వాట్సాప్‌లో తాము చేసే ఛాటింగ్ వివరాలను గోప్యంగా ఉంచుకునేందుకు వీలుంది. వాట్సప్ సెట్టింగ్స్‌లో ప్రైవసీ అనే విభాగంలో అథంటికేషన్ అనే ప్రత్యేకమైన సెక్షన్లో ఫింగర్ ప్రింట్ అనే ఆప్షన్‌ని తీసుకువచ్చింది. దీన్ని ఎనేబుల్ చేసుకున్నప్పుడు, మీ వాట్సప్ అప్లికేషన్ కి పూర్తిస్థాయి రక్షణ లభిస్తుంది. కేవలం మీరు మాత్రమే మీ ఫింగర్ ప్రింట్ ద్వారా వాట్సప్ అప్లికేషన్ లోకి ప్రవేశించడానికి వీలు పడుతుంది.

మీ ఫోన్లో వాట్సప్ అప్లికేషన్ ఐకాన్ ట్యాప్ చేయడం ద్వారా ఇతరులు మీ ఫోన్ లో ఉన్న ఛాట్ కన్వర్‌జేషన్లు చూడడానికి ప్రయత్నించినప్పుడు అది లోపలికి అనుమతించదు. పరోక్షంగా చెప్పాలంటే, ఇది యాప్ లాక్‌గా ఉపయోగపడుతుంది. వెబ్‌బీటా ఇన్ఫో ఈ మేరకు వివరణాత్మక పోస్ట్ చేసింది. కాగా వాట్సాప్ తీసుకు వచ్చే నూతన ఫీచర్‌లో... ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఫీచర్ పరీక్ష ఇంకా ప్రయోగ దశలోనే ఉంది.

ఎయిర్ ఏషియా పండుగ ఆఫర్


- రూ.999కే దేశీయ ప్రయాణం

న్యూఢిల్లీ: పండుగ సీజన్ సందర్భంగా ఎయిర్ ఏషియా ప్రయాణికులకు బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. దేశీ రూట్లలో కేవలం రూ.999 లకే విమాన టికెట్‌ను అందిస్తోంది. జనవరి 21 నుంచి 31 వరకు జరిగే ఒకవైపు ప్రయాణాలపై ఆఫర్ వర్తిస్తుండగా.. ఇందుకు సంబంధించిన బుకింగ్స్ జనవరి 7 నుంచి 20 వరకు అనుమతిస్తున్నట్లు తెలిపింది. మొత్తం 19 గమ్యస్థానాలకు డిస్కౌంట్ అమల్లో ఉంది. ఈ జాబితాలో బెంగళూరు, న్యూఢిల్లీ, కోల్‌కతా, ముంబై, కొచ్చి, గోవా, జైపూర్, చండీగఢ్, పూణె, గౌహతి, ఇంఫాల్, విశాఖపట్నం, హైదరాబాద్, శ్రీనగర్, బాగ్డోగ్ర, రాంచీ, భువనేశ్వర్, ఇండోర్, చెన్నైలు ఉన్నట్లు వెల్లడించింది. అంతర్జాతీయ రూట్లలో రూ.2,999లకే ప్రారంభ ధరను నిర్ణయించింది. కౌలాలంపూర్, బ్యాంకాక్, క్రాబి, సిడ్నీ, ఆక్లాండ్, మెల్బోర్న్, సింగపూర్, బాలి ప్రాంతాలకు ఈ ఆఫర్ ప్రకటించింది.



కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లో మార్కెట్లు


- ఆటుపోట్ల నడుమ సాగిన మార్కెట్లకు లాభాలు తెచ్చిన కొనుగోళ్లు
- ధరలు పెరగటంతో టాప్ లూజర్స్‌గా ఆయిల్ రంగ షేర్లు
- ఒక దశలో మార్కెట్లనూ నష్టాల వైపు ట్రేడింగ్
- 232 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ 36,212 వద్ద ముగింపు
- 53 పాయిట్ల లాభంతో 10,800 మార్క్ దాటిన నిఫ్టీ
- లాభాలకు అవరోధాలుగా రూపాయి క్షీణత, చమురు ధరల పెరుగుగదల



ముంబై: వరుసగా నాలుగో రోజు కూడా దేశీయ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలతో దేశీయ మార్కెట్లకు కలిసొచ్చింది. అమెరికా, చైనా వాణిజ్య యుద్ధ బయాలు తొలగుతాయనే సంకేతాలతో లాభాలకు బాటలు వేసినట్లయిందని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. కాగా, సెషన్ ప్రారంభం నుంచి మందకొడిగానే మార్కెట్లు సాగినప్పటికీ సెషన్ ముగిసే సమయానిని గంట ముందు కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్లు పుంజుకున్నాయి. దీంతో లాభాలు తిరిగి లాభాలు నమోదు చేశాయి. బుధవారంనాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 232 పాయింట్ల లాభంతో 36,212 పాయింట్ల వద్ద, నిఫ్టీ 53 పాయింట్ల లాభంతో 10,855 వద్ద ముగిశాయి. నిఫ్టీ ఇంట్రాడేలో 10,749-10,870 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 35,863 పాయింట్ల కనిష్ట స్థాయిని, 36,250 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి లార్జ్‌క్యాప్ షేర్లు పెరగడం, అంతర్జాతీయ సానుకూల పరిస్థితులు, గ్లోబల్ ఈక్విటీ మార్కెట్ల లాభాలు వంటి అంశాలు మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపాయని నిపుణులు పేర్కొంటున్నారు. రూపాయి క్షీణత, ముడి చమురు ధరల పెరుగుదల వల్ల మార్కెట్ ఒకానొక సమయంలో నష్టాల్లోకి కూడా వెళ్లింది. అయితే చివరి గంటలో కొనుగోలు జోరందుకోవడంతో ఇండెక్స్‌లు మళ్లీ లాభాల్లోకి వచ్చాయి. నిఫ్టీ 50లో యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ, టాటా మోటార్స్, యూపీఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐషర్ మోటార్స్ టాప్ గెయినర్లుగా ఉన్నాయి. అదేసమయంలో హెచ్‌పీసీఎల్, గెయిల్, బీపీసీఎల్, యస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, భారతీ ఇన్‌ఫ్రాటెల్ షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం వల్ల ఆయిల్ రంగ షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. హెచ్‌పీసీఎల్, గెయిల్ షేర్ల 4 శాతం మేర పడిపోయాయి. గెయినర్లలో యాక్సిస్ బ్యాంక్ ఎక్కువగా 3 శాతానికి పైగా లాభపడింది. బ్లాక్ డీల్స్ కారణంగా యస్ బ్యాంక్ షేరు నష్టపోయింది. యూరప్‌లో ఉత్పత్తి తగ్గిందని, దీని వల్ల మూడో క్వార్టర్ ఆర్థిక ఫలితాలపై ప్రతికూల ప్రభావం పడొచ్చని టాటా స్టీల్ ప్రకటించడంతో కంపెనీ షేరు ధర 52 వారాల కనిష్ట స్థాయికి పడిపోయింది. సెక్టోరల్ ఇండెక్స్‌లు మిశ్రమంగా ముగిశాయి. నిఫ్టీ మెటల్ ఇండెక్స్ గరిష్టంగా 1 శాతానికి పైగా పడిపోయింది. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ మీడియా ఇండెక్స్‌లు కూడా నష్టపోయాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ 1 శాతానికి పైగా పెరిగింది.



బంగారు ధరలకు రెక్కలు



న్యూఢిల్లీ: పెళ్లి సీజన్ కారణంగా దేశీ జువెలర్ల నుంచి డిమాండ్ ఎగయడం వల్ల బంగారం ధరలు పెరిగాయని ట్రేడర్లు పేర్కొన్నారు. అయితే ప్రతికూల అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ధరల పెరుగుదల పరిమితంగానే ఉందని తెలిపారు.బంగారం ధరలు వరుసగా మూడో రోజు కూడా పెరిగాయి. ఢిల్లీ మార్కెట్లో బంగారం ధర రూ.110 పెరుగుదలతో రూ.32,800లకు చేరింది. పెళ్లి సీజన్ డిమాండ్ను అందిపుచ్చుకోవడానికి దేశీ జువెలర్ల నుంచి డిమాండ్ ఎగయడం ఇందుకు ప్రధాన కారణం. బంగారం బాటలోనే వెండి ధరలు కూడా పెరిగాయి. కేజీ వెండి ధర రూ.300 పెరుగుదలతో రూ.40,100కు ఎగసింది. పరిశ్రమ యూనిట్లు, నాణేపు తయారీదారుల నుంచి డిమాండ్ ఎగయడం ధరల పెరుగుదలకు దోహదపడింది.

పెళ్లి సీజన్ కారణంగా దేశీ జువెలర్ల నుంచి డిమాండ్ ఎగయడం వల్ల బంగారం ధరలు పెరిగాయని ట్రేడర్లు పేర్కొన్నారు. అయితే ప్రతికూల అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ధరల పెరుగుదల పరిమితంగానే ఉందని తెలిపారు. అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్సుకు 0.38శాతం క్షీణతతో 1,281 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఢిల్లీలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.110 పెరుగుదలతో రూ.32,800కు, 22 క్యారెట్ల బంగారం ధర రూ.32,650కు పెరిగింది. గత రెండు సెషన్లలో బంగారం ధర రూ.190 మేర ఎగసింది.

ఇక ప్రభుత్వ సార్వభౌమ పసిడి పథకంలో 8 గ్రాముల బంగారం ధర రూ.25,200గా నమోదైంది. వెండి ధర రూ.40,100 కి చేరగా.. వారాంతపు ఆధారిత డెలివరీ ధర రూ.277 పెరుగుదలతో రూ.39,333కి పెరిగింది. ఇక 100 వెండి నాణేల కొనుగోలు, అమ్మకం విషయానికి వస్తే.. కొనుగోలు ధర రూ.77,000 ఉండగా.. అమ్మకం ధర రూ.78,000గా ఉంది.

ఇండస్‌ఇండ్‌కు భారీ లాభాలు



న్యూఢిల్లీ: ఇండస్‌ఇండ్ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం రూ.2,287 కోట్లుగా నమోదయ్యింది. అయితే ఈ ఆదాయం మాత్రం మార్కెట్ అంచనాలకు దిగువునే ఉంది. మార్కెట్ వర్గాలు రూ.2,330 కోట్ల ఆదాయాన్ని అంచనా వేశాయి. ప్రైవేట్ రంగ ఇండస్‌ఇండ్ బ్యాంక్ బుధవారం ప్రస్తుత ఆర్థిక సంవత్సం మూడో త్రైమాసిక (అక్టోబర్-డిసెంబర్) ఆర్థిక ఫలితాలు వెల్లడించింది. కంపెనీ నికర లాభం 5.21 శాతం వృద్ధితో రూ.985 కోట్లకు పెరిగింది. ఐఎల్అండ్ఎఫ్ఎస్ మొండి బకాయిల కేటాయింపుల భారం వల్ల నికర లాభం పరిమితంగానే నమోదయ్యింది. బ్యాంక్ నికర లాభం మార్కెట్ అంచనాలు మించింది. మార్కెట్ వర్గాలు ఇండస్‌ఇండ్ బ్యాంక్ నికర లాభం రూ.922 కోట్లుగా ఉండొచ్చని అంచనా వేశాయి. బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.936 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఇండస్‌ఇండ్ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం రూ.2,287 కోట్లుగా నమోదయ్యింది. అయితే ఈ ఆదాయం మాత్రం మార్కెట్ అంచనాలకు దిగువునే ఉంది. మార్కెట్ వర్గాలు రూ.2,330 కోట్ల ఆదాయాన్ని అంచనా వేశాయి. బ్యాంక్ మొండి బాకాయిల కోసం డిసెంబర్ క్వార్టర్‌లో రూ.606 కోట్లను కేటాయించింది. సెప్టెంబర్ క్వార్టర్‌లో ఈ కేటాయింపులు రూ.590 కోట్లుగా ఉన్నాయి. మరోవైపు బ్యాంక్ రుణ నాణ్యత క్షీణించింది. స్థూల ఎన్‌పీఏలు 1.13 శాతంగా నమోదయ్యాయి. సెప్టెంబర్ క్వార్టర్‌లో ఇవి 1.09 శాతంగా ఉన్నాయి. అంటే స్వలంగా పెరిగాయి. నికర వడ్డీ మార్జిన్లు ప్రస్తుత డిసెంబర్ క్వార్టర్‌లో 3.83 శాతానికి తగ్గాయి. ఇవి సెప్టెంబర్ క్వార్టర్‌లో 3.84 శాతంగా, గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో 3.99 శాతంగా ఉన్నాయి. ఇక క్యూ3లో డిపాజిట్లు వార్షికంగా చూస్తే 20 శాతం పెరిగాయి. ప్రొవిజన్ కవరేజ్ రేషియో త్రైమాసికం పరంగా 56 శాతం నుంచి 48 శాతానికి తగ్గింది.

క్యూ3లో వృద్ధి సాధారణమే



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికానికి సంబంధించి కార్పొరేట్ కంపెనీల ఫలితాలు ఈ వారం నుంచే మొదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫలితాలు ఎలా ఉంటాయనే అంశంపై విశ్లేషకుల అంచనాలు దాదాపుగా ఒకే రీతిన ఉన్నాయి. అంతా కూడా... నిఫ్టీ - 50 కంపెనీలు మూడో త్రైమాసికానికి ఆదాయాల్లో మోస్తరు వృద్ధిని నమోదు చేయవచ్చనే అంచనా వేస్తున్నారు. కొన్ని రంగాలు నిదానించడం, అంతక్రితం ఏడాది ఇదే కాలంలో అధిక వృద్ధి నమోదు కావడం ఇందుకు కారణాలుగా ఉండొచ్చని వారు చెబుతున్నారు. తయారీ వ్యయాల తగ్గుదల కారణంగా మార్చి త్రైమాసికంలో వృద్ధి వేగాన్ని అందుకోవచ్చని భావిస్తున్నారు.

ఆదాయాలు ఎనిమిది త్రైమాసికాల కనిష్ట స్థాయిలో 7.5 శాతం చొప్పున వృద్ధి చెందొచ్చన్నది మెజారిటీ విశ్లేషకుల అంచనా. 2017 డిసెంబర్ త్రైమాసికంలో నమోదైన వృద్ధి 13 శాతంగా ఉంది. ఇక నికర లాభాలు వరుసగా మూడో త్రైమాసికంలోనూ ఒకే అంకె స్థాయిలో ఉంటాయని, 6.7 శాతంగా ఉండొచ్చని భావిస్తున్నారు. ఆటోమొబైల్స్, సిమెంట్, ఆయిల్, గ్యాస్, ఫార్మాస్యూటికల్స్, టెలికం రంగ కంపెనీల ఫలితాలు పరిమితంగానే ఉంటాయని అంచనా వేస్తున్నారు. ప్రైవేటు రంగ బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగ కంపెనీలు మెరుగైన ఫలితాలు ఇస్తాయన్న అంచనాలు విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నాయి. ''2018 డిసెంబర్ క్వార్టర్లో పారిశ్రామిక లోహాల ధరలు తక్కువగా ఉన్నాయి. చమురు ధరలు కూడా తగ్గాయి. దీంతో చమురు, మెటల్స్ ముడి పదార్థాలుగా వినియోగించే కంపెనీలకు ప్రయోజనం. రూపాయి కూడా 9 శాతం పడిపోయింది. ఇది దిగుమతిదారులపై, విదేశీ మారకంలో రుణాలు తీసుకునే వారిపై భారాన్ని మోపుతుంది''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ దీపక్ జసాని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వ ద్ధి తిరిగి పుంజుకుంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. నిఫ్టీ-50 ఈపీఎస్ డిసెంబర్ క్వార్టర్లో 18-28 శాతం మధ్య పెరగొచ్చని మార్కెట్ వర్గాల అంచనా. మరోవైపు, క్యూ3లో దేశీ కార్పొరేట్ల ఆదాయాలు, లాభాల వృద్ధి తగ్గొచ్చని రేటింగ్స్ ఏజెన్సీ క్రిసిల్ ఒక నివేదికలో పేర్కొంది. కమోడిటీల ఆధారిత రంగాల ఆదాయాలు గణనీయంగా పెరగొచ్చని సీనియర్ డైరెక్టర్ ప్రసాద్ కొపార్కర్ తెలిపారు. వీటిలో నేచురల్ గ్యాస్ (37 శాతం), ఉక్కు ఉత్పత్తులు (27 శాతం), సిమెంటు (10) శాతం మేర వ ద్ధి సాధించొచ్చని క్రిసిల్ తెలిపింది. ఇక ఇన్‌ఫ్రాకు సంబంధించిన నిర్మాణ తదితర రంగాల వ ద్ధి 12 శాతం స్థాయిలో ఉండొచ్చని అంచనా. వివిధ రంగాలవారీగా విశ్లేషకుల అంచనాలు పరిశీలిస్తే..

ఉక్కు పరిశ్రమ




డిసెంబర్ త్రైమాసికంలో చాలా వరకు కమోడిటీల ధరలు క్షీణించాయి. స్టీల్ ధరలు 15 శాతం వరకు తగ్గడం జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్‌కు ప్రతికూలం. అల్యూమినియం ధరలు తగ్గడం హిందాల్కో, వేదాంత కంపెనీలపై ప్రభావం చూపించనుంది. వేదాంత లిమిటెడ్‌కు చమురు ఉత్పత్తి కూడా ఉంది. చమురు ధరల తగ్గుదల ప్రభావం కూడా ఈ కంపెనీపై పడనుంది.

క్యాపిటల్ గూడ్స్

ప్రభుత్వం నుంచి ఆర్డర్లు నిలకడగా ఉండడం ఈ రంగంలోని కంపెనీలు డిసెంబర్ త్రైమాసికం ఫలితాలకు కలసిరానుంది. అంతకుముందు కొన్ని త్రైమాసికాలుగా ప్రాజెక్టుల విషయంలో నత్తనడక కొనసాగగా... వాటి నిర్మాణం వేగాన్ని పుంజుకుంటోంది. ఈ రంగంలో అగ్రగామి కంపెనీ ఎల్ అండ్ టీ డిసెంబర్ త్రైమాసికంలో అంచనాల కంటే తక్కువ ఆర్డర్లనే సంపాదించింది. దీంతో ఈ కంపెనీ చేసే వ్యాఖ్యలను పరిశీలించాల్సి ఉంది.


బ్యాంకింగ్





మొండి బకాయిల కోసం బ్యాంకులు చేసే ప్రొవిజన్లు తగ్గొచ్చు. బ్యాంకుల్లో కొత్తగా మరిన్ని మొండిబాకీలు నమోదు కావడం తగ్గుముఖం పడుతోంది. దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్‌పై తక్కువ ఈల్డ్ వల్ల ట్రెజరీ ఆదాయం అధికంగా వస్తుందని, ఇది బ్యాంకుల లాభాలను పెంచేదిగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.

సిమెంట్



దేశవ్యాప్తంగా సిమెంట్ ధరలు డిసెంబర్‌లో బ్యాగుపై 2 శాతం వరకు తగ్గి రూ.308 స్థాయికి పరిమితం అయ్యాయి. పలు ప్రాంతాల్లో సిమెంట్‌కు డిమాండ్ పెరిగినప్పటికీ పోటీ కారణంగా ధరలు పెంచే పరిస్థితి లేకపోయింది. పెద్ద కంపెనీలైన ఏసీసీ, అంబుజా సిమెంట్, దాల్మియా భారత్, శ్రీసిమెంట్ కంపెనీలు 10-15 శాతం మధ్యలో అమ్మకాల వృద్ధిని నమోదు చేయవచ్చని, కానీ ఆదాయ వృద్ధి మాత్రం 3-9 శాతానికే పరిమితం అవుతుందని అంచనా వేస్తున్నారు.

ఎఫ్ఎంసీజీ

పండుగల సమయంలో అధిక విక్రయాలు, జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రభావం ఈ రంగ కంపెనీలపై కనిపించనుంది. గత కొన్ని క్వార్టర్లుగా గ్రామీణ డిమాండ్ వ ద్ధికి దన్నుగా నిలిచింది. డిసెంబర్ క్వార్టర్లో మాత్రం ఇది ఒక మోస్తరుగా ఉండొచ్చని భావిస్తున్నారు. అధిక ముడి ఉత్పత్తి వ్యయాల రూపంలో మార్జిన్లపై ప్రభావం ఉంటుంది. అయితే, జీఎస్టీ రేట్ల తగ్గింపు కొంత ఉపశమనం కలిగించేది. ఎఫ్ఎంసీజీ రంగం 8 శాతం వృద్ధి నమోదు చేయొచ్చని అంచనా.



ఆటోమొబైల్స్

ఆటోమొబైల్ కంపెనీల ఫలితాలు ఆకట్టుకునే విధంగా ఉండక పోవచ్చు. ఎందుకంటే మెజారిటీ కంపెనీల విక్రయాలు తగ్గడం, లేదా ఒకే అంకె వ ద్ధికి పరిమితం కావడాన్ని చూస్తూనే ఉన్నాం. పండుగల సీజన్‌లో డిమాండ్ లేకపోవడం, డీలర్ల దగ్గర నిల్వలు పెరిగిపోవడం వంటివి ఆటోమొబైల్ కంపెనీల మార్జిన్లపై ఒత్తిడి పెంచేవే. ఆటో కంపెనీల ఆదాయాల వృద్ధి సుమారు 4 శాతానికి పరిమితం కావొచ్చని క్రిసిల్ అంచనా.

ఫార్మా రంగం

అమెరికా, దేశీయ మార్కెట్లలో సమస్యల నేపథ్యంలో ఫార్మా కంపెనీలు మెప్పించే ఫలితాలను ప్రకటించే అవకాశం లేదని విశ్లేషకుల అంచనా. అమెరికా మార్కెట్లో ధరల పతనానికి బ్రేక్ పడడం ఎగుమతి చేసే ఫార్మా కంపెనీలకు ఊరట కలిగించే విషయం. గత క్వార్టర్‌లో రూపాయి 11 శాతం క్షీణించిన దరిమిలా ఫార్మా 10 శాతం, ఐటీ రంగం 21 శాతం మేర వృద్ధి నమోదు చేయొచ్చని క్రిసిల్ అంచనా వేస్తోంది.



టీమిండియాకు పాక్ దిగ్గజాల ప్రశంసలు



న్యూఢిల్లీ: లెజెండర్ బౌలర్ వసీం అక్రమ్‌తో పాటు పాకిస్థాన్ క్రికెట్ వర్గం టీమిండియాపై ప్రశంసల జల్లు కురిపించింది. ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ గెలిచిన తొలి ఆసియా జట్టుగా టీమిండియా ఘనత సాధించిన విషయం విదితమే. విరాట్ కోహ్లీ నేతృత్వంలోని టీమిండియా సమష్టిగా ఎదురుదాడి చేసిందని అక్రమ్ అన్నారు. 'వేలాది ప్రశంసలకు విరాట్ కోహ్లీ అర్హుడని నేను భావిస్తున్నాను. ఈ విజయం భారత దేశవాళీ క్రికెట్‌ను మరింత ఎత్తుకు తీసుకెళుతుంది' అని ఆయన చెప్పారు. అంతేకాకుండా పాక్ నూతన ప్రధాని, మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ కూడా కోహ్లీ సేనను కొనియాడారు. 'ఆస్ట్రేలియాలో టెస్టు తొలిసారి సిరీస్ గెలిచిన ఉపఖండం జట్టు టీమిండియా, విరాట్ కోహ్లీని నా శుభాకాంక్షలు' అని ఖాన్ ట్వీట్ చేశారు. మరో కెప్టెన్ మొయిన్ ఖాన్.. 'ఆస్ట్రేలియాలో సిరీస్ గెలవడం ఆసియాలోని ఏ జట్టుకైనా సులువు కాదు. కానీ ఈ గెలుపు ఘనత ఖచ్చితంగా టీమిండియాదే' అని చెప్పారు. మాజీ ఓపెనర్ మొహసిన్ ఖాన్ స్పందిస్తూ.. బ్యాట్స్‌మెన్, బౌలర్లు అందరూ కలిసి సమష్టిగా ఈ విజయాన్ని సాధించారు అని అన్నారు. 'ఈ సిరీస్‌లో చటేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్‌తో పాటు ఇతరుల బ్యాటింగ్‌కు ముగ్ధుడనయ్యాను. అంతేకాకుండా ఎలాంటి ఒత్తిడీ లేకుండా బౌలర్లు కూడా బౌలింగ్ చేయగలిగారు' అని మొహసిన్ అన్నారు.

కోహ్లీ, బుమ్రా టాప్

• ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: ఐసీసీ వన్డే ర్యాంకుల్లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తమ విభాగాల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. జట్టు ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న భారత్ వరుసగా ఎనిమిది మ్యాచ్‌లు గెలిస్తే 125 పాయింట్లతో ఇంగ్లాండ్‌కు చేరువలో నిలుస్తుంది.. ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్న ఇంగ్లాండ్ ఖాతాలో 126 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి.



ఆసీస్‌పై 2–1తో టెస్టు సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియా ఆ జట్టుతో మూడు వన్డేలు, న్యూజిలాండ్‌లో ఐదు వన్డేలు ఆడనుంది. వరుసగా అన్ని మ్యాచ్‌లు గెలిస్తే 125 పాయింట్లు లభిస్తాయి. మరోవైపు నాలుగో స్థానంలోని దక్షిణాఫ్రికాను దాటేయాలంటే మాత్రం పాక్ 5–0తో సిరీస్ గెలవాల్సిందే. బ్యాటింగ్ జాబితాలో కోహ్లీ, రోహిత్ శర్మ తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో బుమ్రా అగ్రస్థానంలో ఉండగా కుల్‌దీప్ యాదవ్ మూడో ర్యాంకులో నిలిచాడు. శ్రీలంకపై 3–0తో అద్భుత విజయం సాధించిన న్యూజిలాండ్ ఆటగాళ్ల ర్యాంకులు మారాయి. పరుగుల వరద పారిస్తున్న రాస్ టేలర్ మూడు, మార్టిన్ గప్టిల్ 14 స్థానాల్లో ఉన్నారు. కేన్ విలియమ్సన్ 11వ ర్యాంకుకు చేరుకున్నాడు.

పంత్ నా బిడ్డను ఆడిస్తావా: రోహిత్

ముంబై : టీమిండియా యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కు ఫుల్ డిమాండ్ పెరిగింది. ఆస్ట్రేలియా పర్యటనలో తనదైన శైలిలో స్లెడ్జింగ్.. బ్యాటింగ్‌తో సిరీస్ ఆసాంతం వార్తల్లో నిలిచిన ఈ యువ క్రికెటర్.. బెస్ట్ బేబీసిట్టర్‌గా ఆసీస్ కెప్టెన్ సతీమణి బొన్ని పెయిన్ చేత కితాబు అందుకున్న విషయం తెలిసిందే. అయితే ఇటీవల తండ్రైన టీమిండియా వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ.. సైతం తన కూతురుని ఆడించాలని పంత్‌ను కోరుతున్నాడు. గుడ్ మార్నింగ్ అనే పంత్ ట్వీట్‌కు బదులిస్తూ.. 'శుభోధయం బడ్డీ.. నీవు మంచి బేబీ సిట్టర్‌వని విన్నా. రితికాను సంతోషంగా ఉంచాలంటే నాకు ఓ బేబీ సిట్టర్ కావాలి అంటూ సరదాగా పేర్కొన్నాడు. ఇక రోహిత్ ఒక్కడే పంత్ సాయం కోరడం లేదు.. బొన్ని పెయిన్ సైతం మరోసారి పంత్ సాయం కోరింది. 'పంత్ నీవు ఫ్రీగా ఉంటే మరోసారి నాపిల్లలను ఆడించవా' అని పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్టులు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. బోర్డర్ గవాస్కర్ సిరీస్‌లో 21 ఏళ్ల ఈ యువ క్రికెటర్ 20 క్యాచ్‌లు, 350 పరుగులతో అద్భుతంగా రాణించాడు. వన్డే తుది జట్టులోకి ధోని రావడంతో భారత్‌కు తిరుగొచ్చిన పంత్.. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ వరకు జట్టుకు దూరంగా ఉండనున్నాడు. జనవరి 23 నుంచి భారత్ ఏ జట్టు తరపున బరిలోకి దిగనున్నాడు.

బాధ్యతను పంచుకునేందుకు సిద్ధం

• హైదరాబాద్ బౌలర్ సిరాజ్

హైదరాబాద్: రోజు మాదిరిగానే ఉదయం ప్రాక్టీస్ కోసం సిద్ధపడుతున్న సమయంలో మహ్మద్ సిరాజ్ ఫోన్ మోగింది. ఆస్ట్రేలియాలో కంగారూలతో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో పాల్గొనాలని 24 ఏళ్ల సిరాజ్‌కు చెప్పారు. అంతే ఎగిరి గంతేశాడు. ఇల్లంతా గోల్ గోల చేశాడు. ఇండియాకు ఆడేందుకు నేను ఆస్ట్రేలియా వెళ్లాలి అని తన తల్లిదండ్రులను హత్తుకున్నాడు. 'చాలా ఉత్తేజంగా ఉన్నాను. నాకు పిలుపు వస్తుందని అస్సలు ఊహించలేదు. కొన్ని సెకన్లు అలా నిశ్చేష్టుడినయ్యాను. ఆ తర్వాత గట్టిగా అరుస్తూ నా తల్లిదండ్రులను హత్తుకోవడం మొదలు పెట్టాను. తొలిసారి నాకు వన్డే జట్టుకు పిలుపు వచ్చింది. నిజంగా చాలా సంతోషంగా ఉన్నాను. నేను ఆస్ట్రేలియాకు వెళి టీమిండియాకు ఆడాలి. ఈ పిలుపు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. నాకు ఏదైనా అవకాశం వస్తే దాన్ని తప్పకుండా సద్వినయోగం చేసుకోవాలని మానసికంగా సిద్ధ పడ్డాను. సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించినందుకు చాలా సంతోషంగా ఉంది. అభిమానులను ఏమాత్రం నిరాశ పరచను' అని బుమ్రా అన్నాడు.

పాండ్య, రాహుల్‌కు షోకాజ్ నోటీసులు



24 గంటల్లో వివరణ ఇవ్వాలన్న సీఓఏ చైర్మన్ వినోద్ రాయ్

న్యూఢిల్లీ: భారత యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లకు బీసీసీఐ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఓ టీవీ కార్యక్రమంలో వీరిద్దరు మహిళల పట్ల చేసిన చౌకబారు వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడంతో క్రికెట్ బోర్డు వారిపై కఠిన చర్యలకు సిద్ధమైంది. ఓ టీవీ చానెల్‌లో 'కాఫీ విత్ కరణ్' అనే ప్రోగ్రాంలో బరోడా ఆల్ రౌండర్ పాండ్య మహిళల పట్ల వ్యామోహం, జాత్యాహంకారపూరిత వ్యాఖ్యలు చేశాడు. తర్వాత దానికి క్షమాపణ కోరుతూ ప్రోగ్రాం పక్కదారి పట్టిందని చెప్పాడు. అయితే రాహుల్ మాత్రం ఇప్పటి వరకు స్పందించలేదు. 'హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్ ఓ టీవీ షోలో చేసిన వ్యాఖ్యలకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం. 24 గంటల్లో వివరణ ఇవ్వాలని కోరాం' అని కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీఓఏ) చైర్మన్ వినోద్ రాయ్ అన్నారు. అయితే బుధవారం ఉదయమే పాండ్య ట్విట్టర్‌లో క్షమాపణలు కోరాడు. 'కాఫీ విత్ కరణ్ ప్రోగ్రాంలో నా వ్యాఖ్యలతో బాధ పడిన వారందరికీ క్షమాపణలు చెబుతున్నాను. నిజం చెప్పాలంటే ప్రోగ్రాంలో నా మాటలు పక్కదారి పట్టాయి. అయితే మరొకరి సెంటిమెంట్‌ను కించ పరచాలన్న ఉద్దేశంతో చేసిన వ్యాఖ్యలు కాదు' అని పాండ్య పేర్కొన్నాడు. కొన్ని వారాల క్రితం జరిగిన ఈ టీవీ షోలో పాండ్య 'ప్రతి విషయాన్ని నా తల్లిదండ్రులతో పంచుకుంటాను. సెక్స్‌కు సంబంధించిన విషయాలను కూడా చెప్పేస్తా. అమ్మాయిలతో గడిపిన క్షణాలను సైతం వారి దగ్గర దాచను. నా వర్జినిటీ కోల్పోయిన సందర్భం కూడా వారికి చెప్పాను' అని మాట్లాడాడు. అంతేకాకుండా మహిళలను ఏక వచనంతో అది.. ఇది.. అని సంబోధిస్తూ హేళనగా మాట్లాడాడు. పాండ్య వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి.

పాండ్య, రాహుల్‌లు బీసీసీఐ సీఈఓ రాహుల్ జొహ్రీ ఎదురుగా వివరణ ఇవ్వాలని ఆదేశించినట్టు బోర్డు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 'బీసీసీఐ కొత్త చట్టంలోని సెక్షన్ 41 (సి) ప్రకారం క్రికెటర్లు దుష్ప్రవర్తనా లేదా ఉల్లంఘనలకు పాల్పడితే 48 గంటల్లో సీఈఓ ముందు హాజరై వివరణ ఇవ్వాలి. తర్వాత 15 రోజుల్లోపు సీఈఓ తన నివేదికను అపెక్స్ కౌన్సిల్ ముందు ఉంచుతారు. అయితే ప్రస్తుతానికి వారిని ఆస్ట్రేలియా పర్యటన నుంచి వెనక్కి రప్పించడం లేదు. ఆస్ట్రేలియా నుంచే సీఈఓతో మాట్లాడతారు' అని ఆ అధికారి వెల్లడించారు. వీరిద్దరి ప్రవర్తన పట్ల బీసీసీఐ మాజీ జీఎం (క్రికెట్ ఆపరేషన్స్) రత్నాకర్ శెట్టి కూడా ట్విట్టర్‌లో తన అసహ్యాన్ని తెలిపారు. 'బహిరంగ వేదికల్లో ఇష్టం వచ్చినట్టు మాట్లాడే క్రికెటర్లపై బీసీసీఐ సరైన చర్యలు తీసుకోవాలి. కాఫీ విత్ కరణ్ షోలో హార్దిక్ పాండ్య క్రికెట్ వర్గం తలదించుకునేలా మాట్లాడాడు. మహిళలను కించపరచడమే కాకుండా జాత్యాంహకార ధోరణిని ప్రదర్శించాడు' అని శెట్టి ట్విట్టర్‌లో రాశారు. అయితే ఈ షోలో ఇద్దరు క్రికెటర్లు పాల్గొనడంపై శెట్టి ఆశ్చర్యపోయారు. 'వీరిద్దరూ బీసీసీఐ కాంట్రాక్ట్ పొందిన క్రికెటర్లు. అయితే వీరిద్దరినీ సంప్రదాయ మీడియాతో మాట్లాడించడం లేదు కానీ టాక్ షోలో మాట్లాడేందుకు ఎందుకు అనుమతించారో సీఈఓ, బీసీసీఐ మీడియా మేనేజర్ సమాధానం చెప్పాలి' అని శెట్టి ప్రశ్నించారు. గతేడాది యూఏఈలో జరిగిన ఆసియా కప్ టోర్నీలో వెన్నెముక గాయానికి గురైన పాండ్య పూర్తిగా కోలుకుని ఇటీవలే అంటే మెల్‌బోర్న్‌లో జరిగిన బాక్సింగ్ డే టెస్టుకు ముందు జట్టులో చేరాడు. ఆస్ట్రేలియాతో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియాకు ఆడనున్నాడు. తొలి వన్డే ఈ నెల 12న సిడ్నీలో జరగనుంది. టెస్టు సిరీస్‌లో పేలవ బ్యాటింగ్‌ను కనబరిచిన కేఎల్ రాహుల్ కూడా వన్డే జట్టులో సభ్యుడు.



వన్డేలపై ధోనీ, ధావన్ దృష్టి

• సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో ముమ్మర కసరత్తులు





సిడ్నీ: ఆస్ట్రేలియాపై తొలిసారి టెస్టు సిరీస్ గెలిచిన 'రెడ్ బాల్ బాయ్స్' ఎంజాయ్ చేస్తుంటే.. సీనియర్ ఆటగాడు ఎంఎస్ ధోనీతో పాటు 'వైట్ బాల్ బాయ్స్' మాత్రం సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (ఎస్‌సీజీ)లో నెట్ ప్రాక్టీస్‌లో చెమటలు కారుస్తున్నారు. ఈ ఏడాది వన్డే వరల్డ్ కప్ టోర్నీ దగ్గర పడుతున్న నేపథ్యంలో నిర్ణీత ఓవర్ల స్పెషలిస్టులు మంగళవారమే ఇక్కడికి చేరుకున్నారు. ఈ సమ్మర్‌లో ఇంగ్లాండ్‌లో వరల్డ్ కప్ జరగనున్న నేపథ్యంలో టీమిండియా వీలైనన్ని ఎక్కువ నిర్ణీత ఓవర్ల మ్యాచ్‌లు ఆడనుంది. ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ తర్వాత న్యూజిలాండ్‌లో ఐదు వన్డేలు, తర్వాత మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతుంది. ధోనీతో పాటు వైట్ బాల్ స్పెషలిస్టులు శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, అంబటి రాయుడు, కేదార్ జాదవ్, యజ్వేంద్ర చాహల్, దినేష్ కార్తీక్, ఖలీల్ అహ్మద్ జట్టును చేరుకున్నారు. బుధవారం ఎస్‌సీజీలో ధోనీ, ధావన్, జాదవ్, రాయుడు నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. గురువారం జట్టు తొలి ట్రెయినింగ్ సెషన్‌తో టీమిండియా సన్నాహకాలు ప్రారంభమవుతాయి.

ఖేలో ఇండియా షురూ

• బరిలో 6 వేల మంది అథ్లెట్లు




న్యూఢిల్లీ: దేశాభివృద్ధిలో భాగంగా యువత, అట్టడుగు అభివృద్ధిపై కేంద్రం ప్రధానంగా దృష్టి పెట్టింది. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఖచ్చితంగా ఆ కోవ కిందికే వస్తుంది. ఈసారి ఖేలో ఇండియాను భారీ ఎత్తున నిర్వహించడానికి కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తోంది. వివిధ వయస్సుల వాళ్లు 18 విభాగాల్లో పాల్గొననున్నారు. 'గత కొన్నేళ్లుగా గ్రాస్ రూట్ స్థాయిలో క్రీడల శబ్దం వినిపిస్తోంది. అది నిరంతరం కొనసాగుతుంది. అయితే గతేడాది ఖేలో ఇండియాను ప్రవేశ పెట్టేంత వరకు క్రీడలపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. ఖేలో ఇండియా క్రీడలు వర్గాల వారికి లాభదాయకంగా ఉంది' అని కేంద్ర మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ అన్నారు. రెండో ఎడిషన్ ఖేలో ఇండియాలో 10 నుంచి 21 సంవత్సరాల స్కూల్, కాలేజీ విద్యార్థులకు కూడా అవకాశం కల్పించారు. దీంతో 6 వేల మంది అథ్లెట్లు ఈసారి పోటీల్లో తలపడనున్నారు. బుధవారం మహారాష్ట్రలో ప్రారంభమైన ఈ పోటీలు ఈనెల 20వ తేదీన ముగుస్తాయి. పుణేలోని బలెవాడి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తో పాటు ముంబైలోని ఆర్మీ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్చరీ), మరాడి, పోలీస్ గ్రౌండ్ శివాజీ నగర్ (ఫుట్‌బాల్), ఎన్‌డీఏ హాకీ గ్రౌండ్ (బాలికల హాకీ), ఎంహెచ్ఏ మహీంద్ర హాకీ స్టేడియం (బాలుర హాకీ) ఈ పోటీలకు ఆతిథ్యమిస్తున్నాయి.



ఈ వేదికల్లో అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన అథ్లెట్లు కూడా పతకాల కోసం పోటీ పడనున్నారు. ఇందులో మను భకర్, సౌరబ్ చౌదరి, మెహులి ఘోష్ (షూటింగ్), జిస్నా మాథ్యూ (అథ్లెటిక్స్), జెరెమి లాల్రినుంగ (వెయిట్‌లిఫ్టింగ్), శ్రీహరి నటరాజ్ (స్విమ్మింగ్) ఉన్నారు. వరుసగా స్వర్ణ పతకాలు సాధిస్తూ, వరల్డ్ రికార్డులు నెలకొల్పుతూ భకర్, చౌదరి యువతను ఆకట్టుకుంటున్నారు. 16 ఏళ్ల చౌదరి గతేడాది ఆసియా గేమ్స్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో, యూత్ ఒలింపిక్స్, ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్స్, ఆసియన్ ఎయిర్ గన్ చాంపియన్‌షిప్స్‌లలో స్వర్ణ పతకాలు గెలిచాడు. అంతే వయసున్న భకర్ ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్, కామన్వెల్త్ గేమ్స్, యూత్ ఒలింపిక్స్‌లలో పసిడి పతకాలను సొంతం చేసుకుంది. తొలి ఎడిషన్‌లోనూ పాల్గొన్న లల్రినుంగ యూత్ ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించాడు. 62 కిలోల విభాగంలో భారత్‌కు తొలి యూత్ ఒలింపిక్స్ పతకాన్ని అందించాడు. యూత్ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన ఇతర అథ్లెట్లు రైఫిల్ షూటర్ మెహులి ఘోష్, ఆర్చర్ ఆకాష్ మాలిక్ కూడా ఈ రెండో ఎడిషన్ ఖేలో ఇండియాలో పాల్గొంటున్నారు. దీంతో పాటు 19 ఏళ్ల రన్నర్ మాథ్యూ రియో ఒలింపిక్స్ అనుభవాన్ని ఈ గేమ్స్‌లో ఉపయోగించనుంది. పీటీ ఉష శిష్యురాలైన ఈమె గత రెండో ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకాలు గెలిచింది. అంతేకాకుండా బ్యాక్‌స్ట్రోక్ స్విమ్మర్ నటరాజ్ తన కామన్వెల్త్ గేమ్స్, ఆసియా గేమ్స్ అనుభవాన్ని యువతతో పంచుకోనున్నాడు. బాక్సింగ్ క్రీడలో ఏఐబీఏ వరల్డ్ యూత్ బాక్సింగ్ చాంపియన్ సాక్షి చౌదరి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అంతేకాకుండా డబ్ల్యూటీఏ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో ఇటీవల 200లోపు ర్యాంక్ సాధించిన కర్మన్ కౌర్ థండిపై కూడా అందరి దృష్టి ఉంది.

ఫెడరర్, సెరెనా, జొకోవిచ్ ఫేవరెట్స్

• 14 నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: చాలా కాలంగా ఏడాది తొలి గ్రాండ్ శ్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నోవక్ జొకోవిచ్, రోజర్ ఫెడరర్ ఫేవరెట్‌గా కొనసాగుతున్నారు. అయితే తర్వాతి తరం వాళ్లలో ఎవరో ఒకరు వీళ్ల పట్టును సడలిస్తారా? అన్నది సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోయింది. రాడ్ లెవర్ అరెనా కోర్టులో సెర్బియా వరల్డ్ నంబర్, అతని స్విస్ ప్రత్యర్థి చెరి ఆరు టైటిళ్లు గెలుచుకున్నారు. ఇదిలావుంటే మహిళల విభాగంలో పోటీ మరింత తీవ్రంగా కనిపిస్తోంది. ఈ టోర్నీలో అత్యంత అధిపత్యం ప్రదర్శించే సెరెనా విలియమ్స్ మరోసారి టైటిల్ గెలిచి రికార్డు సృష్టించాలని పట్టుదలగా ఉంది. 2017లో సెరెనా 23వ టైటిల్ గెలిచినప్పుడు ఆమె ఎనిమిది వారాల గర్భవతి. గతేడాది మళ్లీ బరిలోకి దిగిన ఆమె వింబుల్డన్, యూఎస్ ఓపెనలలో ఫైనల్స్‌కు చేరింది. ప్రస్తుతం 16వ ర్యాంక్‌లో కొనసాగుతున్న సెరెనా ఈ ఏడాది తొలిసారి హాప్‌మన్ కప్‌లో పాల్గొనింది. ఆ టోర్నీలో నయోమీ ఒసాకా చేతిలో ఓడినప్పటికీ మెల్‌బోర్న్‌లో మాత్రం సెరెనానే ఫేవరెట్. గతేడాది ఫైనల్లో కరోలిన్ వోజ్నియాకి చేతిలో ఓడిన సీమోనా హాలెప్ ఈసారైనా టైటిల్ గెలవాలని ఆశిస్తోంది. ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ ఏంజెలిక్ కెర్బర్‌కు బర్త్ డే గిఫ్ట్ కానుంది. ఎందుకంటే ఈ టోర్నీ మొదటి వారంలో ఆమెకు 31 ఏళ్లు నిండనున్నాయి. వింబుల్డన్ టైటిల్ గెలిచి కెర్బర్ సంచలనం సృష్టించింది. 1996లో స్టెఫీ గ్రాఫ్ తర్వాత గ్రాండ్ శ్లామ్ టైటిల్ గెలిచిన తొలి జర్మనీ మహిళగా ఆమె రికార్డుల్లోకెక్కింది.

హాకీ కోచ్‌గా హరేంద్ర తొలగింపు

న్యూఢిల్లీ: భారత పురుషుల హాకీ జట్టు కోచ్ పదవి నుంచి బుధవారం హరేంద్ర సింగ్‌ను తొలగించారు. గతేడాది జట్టు పేలవ ప్రదర్శనకు కారణంగా హాకీ ఇండియా (హెచ్ఐ) ఈ నిర్ణయం తీసుకుంది. అయితే జూనియర్ జట్టుకు కోచ్‌గా ఉండాలని కోరింది. మాటి మాటికి కోచ్‌లను మార్చడం భారత హాకీలో పరిపాటి అయిపోయింది. గతేడాది మేలో నియమించిన హరేంద్రను ఇప్పుడు తొలగించడమే ఇందుకు తాజా ఉదాహరణ. 'పురుషుల హాకీ జట్టు ఫలితాలు ఆశించిన మేరకు రాకపోవడంతో చాలా నిరుత్సాహం చెందాం. అయినప్పటికీ జూనియర్ జట్టును తీర్చిదిద్దితే దీర్ఘకాల ప్రయోజనాలు ఉంటాయని హెచ్ఐ విశ్వసిస్తోంది' అని హరేంద్రపై వేటుకు గల కారణాలను హెచ్ఐ వివరించింది. జూనియర్ వరల్డ్ కప్ విజేత జట్టు కోచ్ హరేంద్ర గోల్డ్ కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్ నుంచి వట్టి చేతులతో వచ్చిన భారత జట్టుకు కోచ్‌గా నియమితులయ్యారు. కానీ జట్టు తలరాతను మార్చలేకపోయారు. కోచ్‌ను తొలగించడంతో హై పెర్ఫామెన్స్ డైరెక్టర్ డేవిడ్ జాన్ తాత్కాలికంగా కోచ్‌గా వ్యవహరిస్తారని హెచ్ఐ తెలిపింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District. Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.